PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి.... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 168 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 08 - ఆగష్టు - 2026 , వెల రూ.5/-

# బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం

## - ప్రకటించిన సీఎం చంద్రబాబు

- బీసీల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- ఇప్పటికే చట్టం ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల
- ఆర్థిక కష్టాలున్నా, అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడబోమని చంద్రబాబు స్పష్టం




**నేటి శుభోదయ, అమరావతి :** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు....

2

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు? : జగన్

- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్



2

## రామ మందిర విరాళాల్లో అవినీతి లేదన్న ప్రభుత్వ వర్గాలు..

### - రూ.3,300 కోట్లకు పూర్తి లెక్కలు

- రూ.3,300 కోట్లకు పూర్తి ఆడిట్ జరిగిందని వెల్లడి
- నగదు లెక్కించే సమయంలోనే చోరీ జరిగిందని స్పష్టీకరణ
- ఆరుగురు కాంట్రాక్టు సిబ్బందిని అరెస్టు చేసిన పోలీసులు
- కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న సుప్రీంకోర్టు



2

## నేత కార్మికులకు అండగా నిలుద్దాం : పవన్ కల్యాణ్



- నేడు జాతీయ చేనేత దినోత్సవం
- నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

**నేటి శుభోదయ, అమరావతి :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని నేత కార్మికులు, కళాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశపు గొప్ప నేత వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న నైపుణ్యం కలిగిన చేతులకు గౌరవం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు చేనేత రంగానికి సాధికారత కల్పించేందుకు జనసేన పార్టీలో ప్రత్యేకంగా 'నేత కార్మికుల అభివృద్ధి విభాగం'...

2

## వైసీపీ దీక్షా శిబిరాలపై దాడులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

### - బొత్స సత్యనారాయణ



- దీక్షా శిబిరాలపై దాడులు రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అన్న బొత్స
- వైసీపీ నేతలను అరెస్ట్ చేయడం విచారకరమని వ్యాఖ్య
- నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్

**నేటి శుభోదయ, విజయవాడ :** డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే బాధితులైన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం విచారకరమని బొత్స విమర్శించారు.

## హిట్ అండ్ రన్ కేసు

- నిందితుల అరెస్ట్..
- 14 రోజుల రిమాండ్




**నేటి శుభోదయ, రాజమండ్రి :** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన రాజమండ్రి హిట్ అండ్ రన్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. వైద్య విద్యార్థిని ప్రియాంక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడటానికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే, రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్ గేటు వద్ద స్కూటర్‌పై వెళుతున్న వైద్య విద్యార్థులు ప్రియాంక, ఉమేష్‌లను ఓ కారు బలంగా ఢీకొట్టింది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కారును నిర్లక్ష్యంగా నడుపుతూ ఈ ఘోరానికి పాల్పడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దృశ్యాలన్నీ సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి

## జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు కొత్త కళ...

### - సీఎం చంద్రబాబు వద్ద నేతన్నల హర్షం

- చీరాల నియోజకవర్గంలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- జీఐ ట్యాగ్‌తో కుప్పడం చీరల అమ్మకాలు 30 శాతం పెరిగాయని తెలిపిన కార్మికులు
- ఉచిత విద్యుత్, రూ.25 వేల ఆర్థిక సాయంపై చేనేతల హర్షం



**నేటి శుభోదయ, చీరాల :** భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించడంతో చీరాల కుప్పడం పట్టు చీరలకు విశిష్టమైన గుర్తింపు వచ్చిందని, దీనివల్ల అమ్మకాలు ఏకంగా 30 శాతం పెరిగాయని చేనేత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు కొండంత అండగా నిలుస్తోందని..

2

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం.. లోయలో పడిన కారు, ఒకరి మృతి

- ప్రమాదంలో బెంగళూరుకు చెందిన సతీశ్ కుమార్ మృతి
- శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా ఘటన
- మరో నలుగురు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు



»2

# రామ మందిర విరాళాల్లో అవినీతి లేదన్న ప్రభుత్వ వర్గాలు..

## - రూ.3,300 కోట్లకు పూర్తి లెక్కలు

**మొదటిపేజీ తరువాయి..** యోధ్య రామ మందిరానికి వచ్చిన విరాళాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. రూ.3,300 కోట్ల విరాళాల వినియోగంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశాయి. మొత్తం నిధులకు స్వతంత్ర ఆడిటర్లు పూర్తిస్థాయిలో లెక్కలు పరిశీలించి ధ్రువీకరించారని వెల్లడించాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు వచ్చిన రూ.3,300 కోట్ల విరాళాలపై ఎం/ఎస్ వి శంకర్ అయ్యర్ అండ్ కో సంస్థ ఆడిట్ నిర్వహించింది. ఆలయ నిర్మాణానికి రూ.1,800 కోట్లు, భూసేకరణకు రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ చెల్లింపులన్నీ బ్యాంకుల ద్వారానే జరిగాయని, నగదు లావాదేవీలు లేవని పేర్కొంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటన నగదు లెక్కించే సమయంలో జరిగిన చోరీ మాత్రమేనని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన సైనిక్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు చెందిన ఆరుగురు సిబ్బంది నగదు దొంగిలించినట్లు సీసీటీవీ ఆధారంగా గుర్తించి వెంటనే అరెస్టు చేసినట్లు తెలిపాయి. వారికి ఆలయ ట్రస్ట్‌తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం పనితీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోందని వెల్లడించాయి. సీనియర్ ఐపీఎస్ అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపాయి.

# నేత కార్మికులకు అండగా నిలుద్దాం : పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి..** ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్ తో పాటు రూ.25,000 ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవలో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ.. యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలని, ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పిలుపునిచ్చారు.

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం..

## లోయలో పడిన కారు, ఒకరి మృతి

**మొదటిపేజీ తరువాయి..** తిరుమలలో విషాదం నెలకొంది. శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వెళుతున్న భక్తుల కారు అదుపుతప్పి లోయలో పడటంతో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం శుక్రవారం తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకుంది. బెంగళూరులోని గొట్టిగెరెకు చెందిన సతీష్ కుమార్ (72) తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమైన క్రమంలో, 22వ హెయిర్‌పిన్ బెండ్ వద్ద వాహనం అదుపుతప్పింది. వేగంగా వెళుతూ రక్షణ గోడను ఢీకొట్టిన కారు, సుమారు 15 అడుగుల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సతీష్ కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధు ఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. సతీశ్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు కొత్త కళ...

## - సీఎం చంద్రబాబు వద్ద నేతన్నల హర్షం



**మొదటిపేజీ తరువాయి..** భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించడంతో చీరాల కుప్పడం పట్టు చీరలకు విశిష్టమైన గుర్తింపు వచ్చిందని, దీనివల్ల అమ్మకాలు ఏకంగా 30 శాతం పెరిగాయని చేనేత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు కొండంత అండగా నిలుస్తోందని వారు తెలిపారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'నేతన్న సేవలో' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపేట గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్‌ను సీఎం సందర్శించారు. యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడి చేనేత కార్మికులతో నేరుగా మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల తయారీలో ప్రత్యేకతలు, సంప్రదాయ నైపుణ్యం, ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులు, ఆదాయం వంటి అంశాలపై వారితో వివరంగా చర్చించారు. 'వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్' పథకం ద్వారా తమ ఉత్పత్తులకు మంచి ప్రచారం లభిస్తోందని, గత ఏడాది కుప్పడం పట్టుకు కేంద్ర ప్రభుత్వ అవార్డు రావడం గర్వకారణమని చేనేతలు ముఖ్యమంత్రికి వివరించారు.

# బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం.. ప్రకటించిన సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి..** కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం–అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు? - జగన్

**మొదటిపేజీ తరువాయి..** డీఎస్సీ–2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. "చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందన : శశి థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**నేటి శుభోదయ, ముంబై :** కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల్లో అక్రమాలపై తమ పార్టీ నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన అంగీకరించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ, "సీజేపీ చేపట్టిన అంశాలనే మా పార్టీ, రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' ద్వారా కొన్నిరోజుల ముందే లేవనెత్తారు. కానీ ఆ ప్రచారానికి ఎందుకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదో మేం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల నాడిని మేము సరిగ్గా పట్టుకోవాలి" అని వ్యాఖ్యానించారు.



రాజస్థాన్‌లోని కోటాలో జూన్ 17న రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని ప్రారంభించగా, సీజేపీ నిరసనలు జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మొదలయ్యాయి. సీజేపీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విషయాన్ని శశిథరూర్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. 2029 నాటికి 'జెన్–జీ' అతిపెద్ద ఓటింగ్ వర్గంగా మారుతుందని, వారి ఆకాంక్షలను రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలని శశిథరూర్ సూచించారు. "వీధిలో చేయాల్సిన పోరాటం వీధిలో, సభలో చేయాల్సిన పోరాటం సభలో చేయాలి" అంటూ తమ పార్టీ వ్యూహంపై తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. ఐఐఎంయూఎన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరు కావడం, అదే వేదికపై శశిథరూర్ కూడా కనిపించడంపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారితో చర్చించవద్దని చెప్పడం సరికాదని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉంటూ తన స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# ఫార్చ్యూన్ ఆయిల్ కంపెనీకి భారీ జరిమానా..

# నాణ్యత పరీక్షలో ఫెయిల్..!

- **ఫార్చ్యూన్ ఆయిల్ తయారీ సంస్థ ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్‌కు జరిమానా**
- **సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో విటమిన్ల లోపం ఉన్నట్టు గుర్తింపు**
- **ఉత్పత్తి నాణ్యతలేనిదిగా ప్రకటించిన ఆహార భద్రతా సంస్థ**
- **నూనె సురక్షితమేనని, న్యాయ పోరాటం చేస్తామని కంపెనీ వెల్లడి**

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ప్రముఖ వంట నూనెల బ్రాండ్ ఫార్చ్యూన్ తయారీ సంస్థ, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌కు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జరిమానా విధించింది. ఫార్చ్యూన్ బ్రాండ్‌కు చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు లోపించాయని నిర్ధారణ కావడంతో ఈ చర్యలు చేపట్టింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుండి సేకరించిన ఒక లీటర్ 'ఫార్చ్యూన్ ఫ్రయోలా' రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌లో పరీక్షించారు. ఈ పరీక్షల్లో నూనెలో ఉండాల్సిన విటమిన్–ఏ, విటమిన్–డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆహార భద్రతా, ప్రమాణాల చట్టం–2006 ప్రకారం, ఈ ఉత్పత్తిని 'నాణ్యతలేనిది'గా అధికారులు వర్గీకరించారు. ఈ ఫలితాలపై సదరు సంస్థ అప్పీల్ చేయడంతో, ఆ నమూనాను మరో రిఫరల్ ల్యాబొరేటరీలో పునఃపరీక్షించారు. రెండోసారి నిర్వహించిన పరీక్షల్లోనూ విటమిన్–డి స్థాయి తక్కువగా ఉన్నట్లు ధ్రువీకరణ కావడంతో ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, గోవాలోని అడ్జుడికేటింగ్ అధికారి కంపెనీపై జరిమానా విధించారు. అయితే, జరిమానా మొత్తాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఈ అంశంపై ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ స్పందిస్తూ, తమకు ఇంకా అధికారిక ఉత్తర్వుల కాపీ అందలేదని పేర్కొంది. ఇది కేవలం విటమిన్ల స్థాయికి సంబంధించిన అంశమేనని, ఉత్పత్తి భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఈ నూనె వినియోగానికి పూర్తి సురక్షితమని స్పష్టం చేసింది. నిల్వ చేసే విధానం, కాంతి, కాల పరిమితి వంటి కారణాల వల్ల విటమిన్ల స్థాయి మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. ఆర్డర్‌ను సమీక్షించిన అనంతరం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు తాము కట్టుబడి ఉన్నామని సంస్థ వివరించింది. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇటీవల కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## యాడికి పిహెచ్‌సీకి ఆరు పరుపుల విరాళం








**యాడికి, ఆగస్టు 07, నేటి శుభోదయ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం స్థానిక గ్రామ వాస్తవ్యులు ఉడుముల హరిప్రసాద్ శుక్రవారం ఆరు పరుపులను విరాళంగా అందజేశారు. రోగుల సౌకర్యార్థం దాత అందించిన ఈ పరుపులను వెంటనే ఆసుపత్రిలోని వార్డులో అందుబాటులోకి తీసుకువచ్చారు. పిహెచ్‌సీకి అవసరమైన సమయానికి పరుపులు విరాళంగా అందించడం పట్ల రోగులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దాత ఉడుముల హరిప్రసాద్‌ను వైద్యాధికారులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డిల చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి అభివృద్ధికి, రోగుల సంక్షేమానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని వైద్యాధికారులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ శోభకుమారి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్ గౌడ్, ఎంపిహెచ్ఏ మద్దిలేటి, ఫార్మసిస్ట్ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి , యేసు తదితరులు పాల్గొని హరిప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు

## యాడికిలో 'రైతన్నా మీకోసం' అవగాహన సదస్సులు





**యాడికి ,ఆగస్టు 07 , నేటి శుభోదయ :** ప్రఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యాడికి మండలంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులను ముందుగానే సన్నద్ధం చేసేందుకు మండల వ్యవసాయాధికారి శేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో ప్రత్యక్షంగా పొలాలను సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రచార బ్యానర్లను ప్రదర్శిస్తూ రైతులకు పంట సంరక్షణ మరియు వాతావరణ సానుకూల పంటల ప్రణాళికలపై అవగాహన కల్పించారు.రైతులు ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి పంట కుంటల్లో భద్రపరచుకోవాలని, బిందు, తుంపర సేద్య పద్ధతులను అవలంబించాలని అధికారులు సూచించారు. ఆరుతడి పంటలు, తక్కువ కాలపరిమితి గల రకాలు, అంతర మరియు మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకుని ఆదాయ భద్రతను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక మార్గదర్శకాలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలని అధికారులు కోరారు..

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

### -స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేద్దాం : ఊటుకూరు మహేష్





**ఒంగోలు,ఆగస్టు 7,నేటి శుభోదయ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగర భారతీయ జనతా పార్టీ 3వ మండలం అధ్యక్షులు ఊటుకూరు మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఊటుకూరు మహేష్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఇచ్చిన "లోకల్ ఫర్ వోకల్" పిలుపు మేరకు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్థానిక చేతివృత్తులు, చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రజలంతా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు.చేనేత కార్మికులకు అండగా నిలిచి వారి జీవనోపాధిని మెరుగుపర్చే ఉద్దేశంతో దక్షిణం బజారులోని విష్ణు వేదశ్రీ హ్యాండ్లూమ్ షాపులో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా నేతన్నలకు చేయూత అందించడమే కాకుండా, వాటిని ధరించడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం చాటడంతో పాటు వ్యక్తిత్వానికి ప్రత్యేకమైన అందం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఒంగోలు 3వ మండలం అధ్యక్షులు ఊటుకూరు మహేష్, భారతీయ జనతా పార్టీ ప్రకాశం జిల్లా మీడియా కన్వీనర్ దనిశెట్టి రాము నాయుడు, మండల నాయకులు భూమా శ్రీనివాసరావు, తిరుమలశెట్టి ఆంజనేయులు, నరసింహ తదితరులు పాల్గొని చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

## గుడివాడలో శాకంబరీ దేవిగా అమ్మవారు ఆలయాల్లో భక్తుల కోలాహలం

- **శ్రీ విజయ దుర్గ, శ్రీ గౌరీ శంకర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
- **ఆషాడ మాస చివరి శుక్రవారం కావడంతో ఆలయాలకు పోటెత్తిన భక్తులు**





**గుడివాడ, ఆగస్టు 7 , నేటి శుభోదయ :** ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా గుడివాడలోని పలు ఆలయాల్లో అమ్మవారిని శాకంబరీ దేవిగా వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు.నీలామహల్ రోడ్డు లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానంలో కూడా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి దీవెనలతో ఆషాడమాస ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగినట్లు వేద పండితుల పునీత్ శర్మ తెలిపారు. లోక కళ్యాణార్థం ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ శాకంబరీ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. వేడుకల్లో వేద పండితులు, ఆలయాల ధర్మకర్తల కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 2 రెండవ రోజు దగా డీఎస్సీపై తాడేపల్లిగూడెం నియోజకవర్గంస్థాయి రిలే నిరాహార దీక్షలు



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 7 , నేటి శుభోదయ :** డిఎస్సీ–2025 నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ ఐ ల్యాండ్ సెంటర్ వద్ద రెండవ రోజు రిలే నిరాహార దీక్ష తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా రఘురాం నాయుడు మాట్లాడుతూ డీఎస్సీ ప్రక్రియలో పారదర్శకత లోపించి, వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడంపై సమాధానం చెప్పాలన్నారు.అమలుకాని నిరుద్యోగ భృతి, ఎన్నికల ముందు ప్రతి నిరుద్యోగికి నెలకు ₹3,000 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వకుండా యువతను దారుణంగా మోసం చేశారన్నారు.నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం డీఎస్సీ ద్వారా భర్తీ చేసిన 16 వేల ఉపాధ్యాయ పోస్టుల్లో పారదర్శకత పాటించకుండా, అర్హులైన అభ్యర్థులను పక్కనపెట్టి, అనర్హులకు, అధికార పార్టీ అనుచరులకు ఉద్యోగాలు కట్టబెట్టిందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో అక్రమంగా వెయిటేజ్ మార్కులు జోడించి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు నిర్వహించడం యువత భవిష్యత్తుతో చెలగాటమాడటమేమిటని మండిపడ్డారు.ఈ డీఎస్సీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రిలే నిరాహార దీక్షలు, నిరసన ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. టిడిపి పాలనలో జరిగిన అక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత యువతపై ఉందన్నారు.ఈ శిబిరంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు చిట్టూరి బాపన్న, పెంటపాడు మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు పెంటపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయరాం బాబు, పెంటపాడు మాజీ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ కర్రీ వరహాలు రెడ్డి, కర్రీ శివారెడ్డి, నల్లిమిల్లి అప్పిరెడ్డి,మాజీ వార్డు సభ్యులు మారంపూడి ఏసుదాసు, నల్లిమిల్లి అంజిరెడ్డి, కొవ్వూరు విజయభాస్కర్ రెడ్డి, కర్రీ పృథ్వీ కుమార్ రెడ్డి, చదలవాడ శ్రీనివాస్, తానేటి కుమార్ రాజా, మొఖమట్ల శ్రీను, కలిసెట్టి తాతారావు, బూడి దుర్గాప్రసాద్, దేవరశెట్టి రాంబాబు, చల్లా లింగమూర్తి, చల్లా కుమారస్వామి, దేవరశెట్టి రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, లంక రాజశేఖర్ తదితరులు కూర్చున్నారు. ఈ రిలే దీక్షా శిబిరాన్ని నరసాపురం పార్లమెంటు ఇంచార్జ్ గూడూరి ఉమాబాల సందర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు.

## 10న ఏలూరులో క్విట్ ఇండియా స్ఫూర్తితో రైతుల జైల్ భరో




**ఏలూరు , ఆగస్టు 07, నేటి శుభోదయ :** మంగళవారం స్థానిక బాపట్ల త్రవ్వ కాలువ మహాలక్ష్మి అమ్మవారి చెట్టు దగ్గర మహాలక్ష్మి దేవి అమ్మవారికి సారె మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది కార్యక్రమంలో మహిళలు అత్యధికంగా పాల్గొని అమ్మవారికి సారే సమర్పించారు కార్యక్రమంలో 100 మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం నైవేద్యాలు నిరాజనం మంత్రపుష్పం తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు అని అర్చక స్వామి కేశవాచార్యులు తెలియజేశారు.

## విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

### -మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి




**అనంతపురం బ్యూరో, ఆగస్టు 07 , నేటి శుభోదయ** డాగ్యురే ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన ఏఎన్ఆర్ లెజెండ్స్ జట్టుకు విజేతల కప్‌ను, రన్నరప్‌గా నిలిచిన గూటీ జట్టుకు రన్నరప్ కప్‌ను చైర్ పర్సన్ బల్లా పల్లవి అందజేశారు.టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఫోటోగ్రాఫర్లందరినీ అభినందించారు.క్రీడలతో పాటు ఫోటోగ్రాఫర్లలో ఐక్యత, స్నేహభావం పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని చైర్ పర్సన్ బల్లా పల్లవి పేర్కొన్నారు. నేటి యువతకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ఆమె తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యలోనూ, క్రీడల్లోనూ రాణించాలని బల్లా పల్లవి యువతకు సూచించారు.

## అవసరమైన మేరకు నీరు వాడండి

**-మండల వ్యవసాయ అధికారి, ఇంచార్జ్ ఏ డి ఏ నారాయణరావు**



**తాడేపల్లిగూడెం ,ఆగష్టు 7 , నేటి శుభోదయ :** ప్రస్తుత సార్వ పంటలో రైతులు అవసరమైన మేరకు నీటిని వాడాలని తాడేపల్లిగూడెం ఇన్చార్జి ఏ డి ఏ, మండల వ్యవసాయ అధికారి నారాయణరావు రైతులను కోరారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాలను నిర్వహించారు. ఆరుగొలను సొసైటీ సమావేశ మందిరంలో ఎల్ నినో ప్రభావం పై రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ప్రస్తుతం వర్షపాతం 75 శాతం తక్కువ కురిసిందని తెలిపారు. దీనివలన జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. కామవరపుకోట, కోయిలగూడెం మండలాల్లో వర్షపాతం లేకపోవడం వల్ల నారుమల్లు తీయకుండా ఉంచేసారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో ఉన్న వ్యవసాయ బోర్లను నియంత్రించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలు నెమ్మదిగా తగుముఖం పట్టడం వల్ల వేగం తగ్గి నెమ్మదిగా నీరు వస్తోందని చెప్పారు. దీనివల్ల రైతులు అవసరమైన మేరకు మాత్రమే నీరు వాడాలని తెలిపారు. ప్రస్తుత సార్వ పంటకు కొద్దిపాటి నీరు సరిపోతుందని పొట్ట తగిలి సమయానికి ఐదు అంగుళాల నీరు చేలలో ఉండాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రస్తుత సార్వ పంట ఏ విధంగా ఉంది ఏ స్థాయిలో ఉందో తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని ముఖ్యమంత్రి కి సమాచారం మేరకు ప్రతిరోజు పంపుతున్నారని తెలిపారు. ఏద్దైతే ఏ పంట వేశారు తదితర వివరాలను సిబ్బంది తయారుచేసి ప్రభుత్వానికి సమాచారం చేరవేస్తున్నారని ఏవో చెప్పారు. సార్వ తర్వాత రబీ విషయంలో సాగు నీరు అందకపోతే ఏ పంటలు వెయ్యాలో ఇప్పటి నుండే రైతులు సిద్ధం కావాలని అన్నారు. దాల్వాలో మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏవో నారాయణరావు చెప్పారు. గత ఏడాది 2900 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు వినియోగించారని ఈ సంవత్సరం యూరియాను నియంత్రించడం వలన 1900 మెట్రిక్ టన్నులు యూరియా వినియోగిస్తున్నారని చెప్పారు. యూరియా అధికంగా వినియోగించడం వలన చేలతో పాటు మనుషులపై కూడా తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపుతోందని హెచ్చరించారు. సార్వలో యూరియాను నియంత్రించడం వలన రైతులు ఆందోళన చెందవద్దని , రబీలో నాలుగు బస్తాలు ఇస్తారని ఏవో నారాయణరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఈఓ సాగర్, పవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూస్తే పుట్టగతులుండవ్

- మా ఉద్యమాన్ని జనం పట్టించుకోకపోతే మీకెందుకు ఉలికిపాటు?
- అక్రమ కేసులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ భయపడదు
- డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరగకపోతే విచారణకు ఎందుకు భయం?
- వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- అనంతపురంలో రెండో రోజు రిలే నిరాహార దీక్షలు



**అనంతపురం బ్యూరో ,ఆగష్టు 7 , నేటి శుభోదయ :** రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన కాకుండా నారాసుర పాలన సాగుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని.. అక్రమ కేసులు, అరెస్టులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడదని స్పష్టం చేశారు. డీఎస్సీ–2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగుల జీవితాలతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు చెలగాటం ఆడారని మండిపడ్డారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో వైసీపీ మహిళా విభాగం, విద్యార్థి విభాగం, సాంస్కృతిక, వాలంటీర్స్, వాణిజ్య, గ్రీవెన్స్, పంచాయతీరాజ్, దివ్యాంగుల, ఇంటెలెక్చువల్ విభాగాలతో పాటు నగరంలోని 14వ నుంచి 23వ డివిజన్ల నేతలు, ఎ.నారాయణపురం పంచాయతీ నాయకులు కూర్చున్నారు. దీక్షా శిబిరం వద్ద నల్లబెలూన్లు ఎగురవేసి అనంత వెంకటరామిరెడ్డి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలతో పాటు నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే విజయవాడ, గుంటూరు, కనిగిరి, రేపల్లె వంటి ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రశ్నించడమే నేరం అనే విధంగా అరెస్టులు, అక్రమ కేసులు పెడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్ఆర్ పార్టీ ఎప్పుడూ భయపడదని చెప్పారు. డీఎస్సీ నియామకాల్లో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న యువతను ఉద్దేశించి గంజాయి బ్యాచ్.. రెండు నిమిషాల్లో ఉద్యమాన్ని అణచివేస్తాం అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంటే రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి దొరుకుతోందని చంద్రబాబు అంటున్నారా? అని ప్రశ్నించారు. నీట్ వ్యవహారంలో ఉద్యమించిన యువతను ఢిల్లీలో అణచివేయాలని చూస్తే ఏం జరిగిందో తెలుసుకోవాలని హితవు పలికారు. అధికార, పోలీస్ బలంతో తమ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఉద్యమాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదని కొంత మంది ఎమ్మెల్యేలు చెబుతున్నారని.. మరి జనం పట్టించుకోకపోతే మీరెందుకు ఉలిక్కిపడుతున్నారని చురకలంటించారు. డీఎస్సీ వ్యవహారంలో ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే తమ ఉద్యమాన్ని చులకన చేసేలా మాట్లాడుతున్నారని తెలిపారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు పోలీసులు నడుచుకోవద్దని కోరారు. అక్రమ అరెస్టులు, కేసులు పెడితే తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు.

## కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి : సీపీఐ పిలుపు



**యాడికి ,ఆగస్టు 07, నేటి శుభోదయ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసి, నిరంకుశ పాలన సాగిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. జాఫర్, అనంతపురం జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి ఆరోపించారు. 'దేశంలో మార్పు రావాలి' అనే సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టిన పోరుబాట జీపు జాతా శుక్రవారం యాడికి మండల కేంద్రానికి చేరుకుంది. గాంధీ విగ్రహం వద్ద సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సాధించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. వర్షాభావం, తీవ్ర కరువు పరిస్థితులతో విలవిలలాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనివల్ల ఖరీఫ్ సాగు విస్తీర్ణం సగానికి పైగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాడికి కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు అందించాలని, రాష్ట్రంలోని కరువు ప్రాంతాలను అధికారికంగా ప్రకటించి ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పంటకు 100 శాతం ఉచిత బీమా వర్తింపజేయాలని, ఉచితంగా విత్తనాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అలాగే అర్హులైన ప్రతి నేతన్నకు 'నేతన్న సేవ' పథకం కింద 25 వేల రూపాయలు అందజేయాలన్నారు.ప్రజాసమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జీపు జాతాలు నిర్వహించి, ఆగస్టు 17న అనంతపురం కలెక్టరేట్ ముందు చేపడుతున్న భారీ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. కేశవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలూరు లక్ష్మయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, అజయ్ బాబు, శ్రీరాములు, ఓబిరెడ్డి, పట్టణ కార్యదర్శి కుల్లాయిరెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, పల్లా కృష్ణమూర్తి, పుట్లూరు చౌడయ్య, మల్లారెడ్డి, వెంకటస్వామి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ హోమియో కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**గుడివాడ, ఆగష్టు 7, నేటి శుభోదయ :** గుడివాడలోని డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లక్ష్మీ తులసి (28) ప్రైవేట్ హాస్టల్ రూమ్ లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.నరసాపురం సమీప గ్రామానికి చెందిన లక్ష్మీ తులసి గుడివాడ గురురాజు ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో చదువుతోంది. ఈ రోజు కాలేజీకి రాకపోవడంతో అనుమానం వచ్చిన సహచర విద్యార్థులు ఆమె ఉంటున్న ప్రైవేట్ హాస్టల్ రూమ్ కు వెళ్లి చూడగా, లక్ష్మీ తులసి ఉరివేలాడుతూ కనిపించింది. వెంటనే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కు సమాచారం అందించారు. ప్రిన్సిపాల్ పోలీసులకు, లక్ష్మీ తులసి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.సమాచారం అందుకున్న లక్ష్మీ తులసి తల్లిదండ్రులు హుటాహుటిన హాస్పిటల్ కు చేరుకున్నారు. కుమార్తె భౌతిక కాయాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో హాస్పిటల్ ప్రాంగణం శోకసముద్రమైంది.గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎన్. టి. ఆర్. స్టేడియం ఏర్పాటు కు కృషి చేసిన పర్వతనేని జగన్మోహనరావు జయంతి వేడుకలు






**గుడివాడ, ఆగష్టు 7, నేటి శుభోదయ :** నందమూరి తారక రామారావు క్రీడాప్రాంగణ సృష్టికర్త, మహానుభావుడు ప్రజల మనిషి స్వర్గీయ పర్వతనేని జగన్మోహన్ రావు 103 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎం. టి. ఆర్. స్టేడియం ప్రాంగణంలోని పర్వాతనేని జగన్మోహనరావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసినివాళులర్పించారు.ఈ సందర్భంగా స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్ మాట్లాడుతూ గుడివాడలో స్టేడియం కట్టాలనే జగన్మోహనరావుకు రావడం దానిని నందమూరి తారక రామారావు దృష్టికి తీసుకు వెళ్లి ఒప్పించి స్టేడియం నిర్మాణానికి మూలవ్యక్తి జగన్మోహనరావని అటువంటి వ్యక్తిని జయంతికి వర్ధంతికి తలచుకోవాలన్నారు. అనంతరం ఆయన కుమారుడు పర్వతనేని ఆనంద్ స్థానిక నీలామాల్ రోడ్ లోని మునిసిపల్ మోడల్ ప్రైమరీ స్కూలు విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకములు తదితరాలను అందచేశారు.అలాగే చెరుకూరి రమేష్ స్కూల్లో ఉత్తీర్ణత శాతం లో ప్రధమ స్థానం పొందిన ఐదుగురు చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు 500 చొప్పున 2500లను అందచేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్ విచ్చేసి విద్యార్థులకు పుస్తకాలు మరియు నగదు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టి హరికుమార్ యాదవ్, పావని ప్రసాద్ , సయ్యద్ గఫార్ , దుక్కిపాటి రవి భూషణ్ , లంకపల్లి లాజరు , కోడూరు ప్రభు , దేవాది నాగేశ్వరరావు , బొగ్గరపు తిరుపతయ్య, హరి బాబు , పుట్టి వెంకటేశ్వరావు , జాజుల తాతారావు, స్కూల్ హెచ్ఎం నాగ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## హత్యకు గురైన చెన్నారెడ్డి మృత దేహానికి నివాళులర్పించిన : పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి



**మాచర్ల, ఆగస్టు 7, నేటి శుభోదయ :** మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నవులూరి భాస్కర్ రెడ్డి గారి కుమారుడు, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ నవులూరి చెన్నారెడ్డి గారి పార్థివదేహానికి వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గారు, పార్టీ యువ నాయకులు శ్రీ పిన్నెల్లి వెంకట రామిరెడ్డి గారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చెన్నారెడ్డి గారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు శ్రీ పూనూరు గౌతమ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీ కాసు మహేష్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే శ్రీ తాడిపత్రి చంద్రశేఖర్, SEC సభ్యులు శ్రీ కొమ్మారెడ్డి చలమారెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కె.వి.), పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు యెనుముల మురళీధర్ రెడ్డి,గురజాల నియోజకవర్గం పరిశీలకులు పడాల శివారెడ్డిగార్లతో, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చెన్నారెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

## గుడివాడ - శివమొగ్గ ప్రత్యేక రైలుకు గ్రీన్ సిగ్నల్ దిశగా ముందడుగు

### - ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషికి ఫలితం

**మచిలీపట్నం, ఆగష్టు 7, నేటి శుభోదయ :**
మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ వల్లభనేని బాలశౌరి చేసిన విజ్ఞప్తిపై గుడివాడ నుండి శివ మొగ్గ టౌన్ వరకు ప్రత్యేక రైలును నడిపే ప్రతిపాదనను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పరిశీలించారు. ఈ ప్రత్యేక రైలు నిర్వహణ ఆపరేషనల్ పరంగా సాధ్యమే అని సంబంధిత అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ మేరకు వాణిజ్యపరమైన సాధ్యత, ప్రయాణికుల డిమాండ్, ఆక్యుపెన్సీ మరియు ఆదాయ అవకాశాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రత్యేక రైలు ద్వారా సుమారు 1,000 మంది భక్తులు శృంగేరి శారదా పీఠాన్ని సందర్శించే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం విజయవాడ డివిజన్ పరిధి నుంచి శివమొగ్గ ప్రాంతానికి నేరుగా రైలు సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రత్యేక రైలు యాత్రికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రైల్వేకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని వాణిజ్య విభాగం అభిప్రాయం వ్యక్తం చేశారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల భక్తుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక రైలు అవసరమని పేర్కొంటూ, ప్రతిపాదనను ప్రధాన కార్యాలయానికి తదుపరి ఆమోదం కోసం పంపాలని అధికారులు సిఫారసు చేశారు. అనంతరం విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ కూడా ఈ ప్రతిపాదనను ఆమోదించి తదుపరి ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, శృంగేరి శారదా పీఠం దర్శనా



నికి వెళ్లే భక్తులకు ఈ ప్రత్యేక రైలు ఎంతో ఉపయోగపడుతుందని, రైలును త్వరలోనే నడిపేందుకు రైల్వే బోర్డు స్థాయిలో అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## లాలాచెరువు రైతు బజార్ లో సబ్సిడీ సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

- **ప్రతీ పేదవారికి నాణ్యమైన సన్నబియ్యం అందివ్వాలనేదేప్రభుత్వ ధ్యేయం.ఎమ్మెల్యే 'బత్తుల'..!**
- **కూటమి నేతలతో సందడిగా స్టాల్ ను ప్రారంభించిన రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ**

**కోరుకొండ, ఆగస్టు 8,నేటి శుభోదయ :**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు..రాజానగరం మండలం లాలాచెరువు నందు గల రైతుబజార్ లో తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం విక్రయ కేంద్రాన్ని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులతో కలిసి ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి. వైస్ చైర్మన్ శ్రీమతి ముక్కా దేవి రాంబాబు, బిజెపి సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికి సన్నబియ్యం మార్కెట్ ధర కంటే 10 నుండి 12 రూపాయలు తక్కువ ధరకు అందివ్వాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఈ రోజు నుండి ఈ సన్నబియ్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో 45 కేంద్రాల ద్వారా బియ్యం సరఫరా జరుగుతుందని ఈ పంపిణీ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మరిన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ధనిక,





పేద తేడా లేకుండా ప్రతీ కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ ద్వారా మంచి ఆహారం తినాలనేదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమం సజావుగా సాగడానికి ప్రతీ ఒక్కరూ భాద్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభంచిన జమాల్ ఖాన్

**చింతూరు, ఆగస్టు 7 , నేటి శుభోదయ :**
రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని చింతూరు మండల తెలుగు దేశం అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ వేగితోట గ్రామం లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు రైతుల వద్దకు వెళ్ళి తమ పథకాలు గురించి వివరించారు ఎల్ నినో ప్రభావం – నివారణ కార్యాచరణ ప్రణాళిక గురించి రైతులకు అవగాహన కల్పించారు.ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో ప్రతి రైతును ప్రతి వ్యవసాయ భూకమతం 100 శాతం సందర్శించుటపంట పరిస్తితి, నీటి కొరత వలన పంట వాడిపోవడం లేదా ఎండిపోవడం, చీడ పీడల ఉధృతి, ఉద్యాన పంటల పరిస్థితి, బీడు లేదా సాగు చేయని భూముల వివరాలు వంటి అంశాలను అంచనా వేయడంబీడుగా ఉన్న సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రోత్సహించారు.అప్ ద్వారా రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. అంశాలన్నీ,రైతులకువివరించారు.ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో ప్రతి రైతును ప్రతి వ్యవసాయ భూకమతం 100 శాతం సందర్శించుటపంట పరిస్తితి, నీటి కొరత వలన పంట వాడిపోవడం లేదా ఎండిపోవడం, చీడ పీడల ఉధృతి, ఉద్యాన పంటల పరిస్థితి, బీడు లేదా సాగు చేయని భూముల వివరాలు వంటి అంశాలను అంచనా వేయడంబీడుగా ఉన్న సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రోత్సహించడం, అప్ ద్వారా రైతులకు అవసరమైన సూచనలు సలహాలుఅందజేశారు.ఈ అంశాలన్నీరైతులకువివరించారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన గుళికలు తయారు చేయడం లైవ్ లో చూపించారు .. ఈ విత్తన గుళికలు వలన వర్షాభావ పరిస్థితుల్లో కూడా విత్తనం మొలక శాతం మెరుగవుతుంది ,చీడ పీడల నుండి రక్షణ వస్తుందన్నారు.క్షేత్ర సందర్శన లో భాగంగా 30 రకాల పైన విత్తనాలు వేసిన పొలాన్ని రైతులతో సందర్శించారు.అలాగే రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించడం జరిగింది. వరి కి ఎకరానికి 646/– ఈ నెల 15 తేదీ లోగా బీమా ప్రీమియం సమీప





మీసేవ కేంద్రం లో చెల్లించాలని తెలిపారు.గట్లు మీద వేయుటకు కందులు అందుబాటులో ఉన్నాయని రైతులు తీసుకోవచ్చు అని తెలిపారు.ప్రస్తుతం యూరియా డిఏపి రైతు సేవ కేంద్రం సొసైటీ ప్రైవేటు షాప్ లో అందుబాటులో ఉందని తెలిపారు. ఈ పంట నమోదు కాని రైతులు తమ సమీప వ్యవసాయ సిబ్బంది ద్వారా అప్డేట్ చేయించు కోవాలనీ తెలిపారు.మండలం లోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో ఈరోజు ఈ కార్యక్రమం ప్రారంభించారుఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రత్న ప్రభ,మండల టీడీపీ అధ్యక్షులు జమాల్ ఖాన్,మార్కెట్ కమిటీ సభ్యులు సాల్మన్ రాజు,వ్యవసాయ సిబ్బంది శివ శ్రీనువెటర్నరీ సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## నమ్మకంగా పిలిచి.. నయవంచన చేశాడు

## వికటించిన ప్రేమ.. యువతి దారుణ హత్య

- **ఐదేళ్ల ప్రేమ వ్యవహారానికి అనుమానమే చిచ్చు**
- **కారంపూడి మండలం ఎన్ఎస్పీ కాలువ కట్ట వద్ద హత్య..**
- **నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ముఖ్యమంత్రి అరెస్టు జైలు శిక్ష..**
- **బోరున విలపించిన తల్లిదండ్రులు**





**కారంపూడి, ఆగస్టు 07,నేటి శుభోదయ :**
ఐదేళ్లుగా కొనసాగిన ప్రేమ వ్యవహారం అనుమానాల కారణంగా విషాదాంతమైంది. ప్రియురాలిని నమ్మకంగా కారంపూడికి పిలిపించిన యువకుడు, అనంతరం ఆమెను దారుణంగా హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో వెలుగుచూసింది.పోలీసుల వివరాల ప్రకారం, చిలకలూరిపేటకు చెందిన షేక్ హసీనా (25), కారంపూడి మండలం ఇనుపురాజుపల్లె గ్రామానికి చెందిన జిలుగు బాలసైదులు గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ గుంటూరులో బీటెక్ చదువుతున్న సమయంలో పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం హసీనా చెన్నైలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఇద్దరి మధ్య ప్రేమ కొనసాగుతోంది.కొద్ది రోజుల క్రితం బాలసైదులు ఫోన్ చేసి కారంపూడికి రావాలని హసీనాను పిలిచాడు. అతడిని నమ్మిన హసీనా కారంపూడి మండలం పేట సన్నిగండ్ల గ్రామ సమీపంలోని ఎన్ఎస్పీ కాలువ కట్ట వద్దకు చేరుకుంది. ఇటీవల ఆమె సెల్ఫోన్లోని కొన్ని ఫోటోలు చూసి అనుమానం పెంచుకున్న బాలసైదులు ముందుగానే హత్యకు పథకం వేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.పథకం ప్రకారం హసీనాను కాలువ కట్ట సమీపంలోని పొలిమేరల వైపు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం నిందితుడు హైదరాబాద్కు వెళ్లి, అక్కడి నుంచి నంద్యాల వెళ్తూ తన తండ్రి జిలుగు యలమందకు ఫోన్ చేసి, హసీనాను హత్య చేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని తెలిపినట్లు సమాచారం.ఇదే సమయంలో కుమార్తె కనిపించడం లేదంటూ హసీనా తల్లిదండ్రులు చిలకలూరిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలసైదుపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అతని తండ్రిని విచారించగా, కుమారుడు ఫోన్ చేసిన విషయాన్ని వెల్లడించారు. ఆ సమాచారంతో పోలీసులు నంద్యాలలో బాలసైదును అదుపులోకి తీసుకుని విచారించగా, హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలిసింది.నిందితుడి చూపిన మేరకు పోలీసులు కారంపూడి మండలం పేట సన్నిగండ్ల సమీపంలోని ఎన్ఎస్పీ కాలువ కట్ట వద్దకు చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనస్థలాన్ని చిలకలూరిపేట సీఐ రమేష్, ఎస్సై హజరతయ్య, సోమేశ్వరరావు పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. గురజాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ ఘటనతో మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కేసుపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని చిలకలూరిపేట సీఐ రమేష్ తెలిపారు

## మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ

### : ఎమ్ఆర్పిఎస్ నాయకులు



**యాడికి, ఆగస్టు 07, నేటి శుభోదయ :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితంగానే దేశంలో పేదలకు ఆసరాగా నిలిచే ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుందని ఎమ్ఆర్పిఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) నాయకులు కొనియాడారు. అనంతపురం జిల్లా యాడికి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం 'ఆరోగ్యశ్రీ పథకం సాధన దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్పిఎస్ మండల కమిటీ నిర్మాణ ఇన్చార్జి ఎం.పి. పుల్లయ్య మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గుండె జబ్బుతో బాధపడుతున్న నిరుపేద ముస్లిం బాలిక నసీమా వైద్యం కోసం మందకృష్ణ మాదిగ నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డితో చర్చించి, హైదరాబాద్ ట్యాంక్బండ్ వేదికగా గుండె జబ్బుల పిల్లలతో చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఈ పోరాటం వల్ల నేడు లక్షలాది మంది పేద ప్రజలు ఉచిత వైద్యం పొంది పునర్జన్మ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు జూటూరు రఫీ, రజాక్లు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్ఆర్పిఎస్ మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ, అధికార ప్రతినిధి చిటికల చిరంజీవి మాదిగ, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు నరసింహులు, సూర్యుడు, గాంధీ, శ్రీరాములు, రామాంజనేయులు, చిన్న రాముడు, సుబ్బరాయుడు, నాగార్జున, టైలర్ పుల్లయ్య, వెంకటరమణయ్య, టైలర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

# నా కుమార్తెకు జరిగిన దారుణం మరో ఆడబిడ్డకు జరగొద్దు

**కారంపూడి, ఆగస్టు 7, నేటి శుభోదయ :**







ప్రేమ వ్యవహారం నేపథ్యంలో హత్యకు గురైన షేక్ హసీనా మృతదేహం వద్ద ఆమె తల్లిదండ్రులు షేక్ రహీనా, మస్తాన్ వలి శుక్రవారం కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమార్తెకు జరిగిన దారుణం మరో ఆడ బిడ్డకు జరగకూడదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ కుమార్తె చదువుకుని చెన్నైలో ఉద్యోగం చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తోందని, ఇనుపురాజుపల్లె గ్రామానికి చెందిన బాలసైదులు ముందస్తు పథకం ప్రకారమే హత్య చేశాడని ఆరోపించారు. మెడ నిండా బంగారం ధరించి ఆనందంగా తిరిగే తమ కుమార్తె ఇక లేదనే విషయం జీర్ణించుకోలేకపోతున్నామని బోరున విలపించారు."అమ్మా... పరీక్ష రాసి వస్తాను" అని చెప్పి వెళ్లిన తమ కుమార్తె తిరిగి శవంగా కనిపించిందని తండ్రి మస్తాన్ వలి కన్నీటి పర్యంతమయ్యారు. చనిపోయే ముందు ఫోన్‌లో చెప్పిన మాటలు తమను కలచివేశాయని తెలిపారు.హత్య కేసులో నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళల భద్రతపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని, తమ కుమార్తెకు జరిగిన ఘటన మరో కుటుంబానికి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై స్పందించి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

- **అనంతపురం అభివృద్ధి కోసం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ అంబికా వినతులు**
- **జాతీయ రహదారి విస్తరణ, సర్వీస్ రోడ్లు, లింక్ రోడ్లు, అండర్‌పాస్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**అనంత పురం బ్యూరో ఆగస్టు 07, నేటి శుభోదయ :**



అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదల, రోడ్డు భద్రత, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి 3 కీలక వినతిపత్రాలను సమర్పించారు.అనంతపురం జిల్లా భవిష్యత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ కోరారు.హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలి :హైదరాబాద్–బెంగళూరు మధ్య ఉన్న ఎన్ హెచ్ -44 దేశంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారులలో ఒకటని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న ఈ మార్గం సామర్థ్యానికి మించి వాహన రాకపోకలు సాగుతున్నందున తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.ఈ రహదారిని విస్తరించేందుకు గతంలో డీపీఆర్‌లు సిద్ధమైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని గుర్తుచేస్తూ, తక్షణమే పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి ప్రాధాన్యత ఆధారంగా విస్తరణ పనులు ప్రారంభించాలని కోరారు.అలాగే గుత్తి – గుంతకల్లు జాతీయ రహదారి టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించమని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని ఎంపీ కోరారు.అనంతపురం నగరంలో ఎన్. హెచ్44పై సర్వీస్ రోడ్లు, వాహన అండర్‌పాస్‌లలో మార్పులు అవసరం :అనంతపురం పట్టణ పరిధిలోని సాక్షి కార్యాలయం అండర్‌పాస్ నుంచి ప్రసన్నాయపల్లి అండర్‌పాస్ వరకు సుమారు 750 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ తెలిపారు. ఈ కారణంగా ప్రధాన రహదారిని దాటాల్సి రావడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలని కోరారు.

# అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## - ప్రజాదర్బారులో గద్దె రామమోహన్, గద్దె అనురాధ

**విజయవాడ, ఆగష్టు 07,నేటి శుభోదయ :**



ప్రజలు చెబుతున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె , టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం శాసనసభ్యులు ఆధ్వర్యంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం తమ కార్యాలయం తెరిచే ఉంటుందని, రోజువారీ ప్రజలు తమ సమస్యలతో వస్తూంటారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం పనిచేస్తున్నామని చెప్పారు. కొన్ని సమస్యలు ప్రభుత్వం పరిధిలోనివని, ప్రజాదర్బారు రోజు అధికారులు కూడా ఉంటారని, ప్రజల సమస్యలను వారు నమోదు చేసుకొని ప్రభుత్వానికి విన్నవిస్తారని చెప్పారు. ప్రభుత్వం పథకాలను రూపొందించి, ప్రజలకు మరింతగా సంక్షేమం అందించడానికి ప్రజాదర్బారులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పొట్లూరి సాయిబాబు, మాజీ కార్పొరేటర్లు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, టిడిపికి చెందిన ఇతర ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా పికిల్‌బాల్‌కు ఆదరణ

**విజయవాడ, ఆగస్టు 7 , నేటి శుభోదయ :**



ఇటీవల కాలంలో పికిల్‌బాల్ గేమ్‌కు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు చెప్పారు.శుక్రవారం ఉదయం తూర్పు లోని నోవాటెల్ హోటల్ పక్కన ఉన్న నైట్రో పికిల్‌బాల్ ఆవరణలో 'అమరావతి పికిల్ బాల్ టోర్నమెంట్' ప్రారంభోత్సవం జరిగింది. క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఎమ్మెల్యే గద్దె , శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు, సినిహీరో సుశాంత్ హజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు.·ఈ సందర్భంగా మంత్రి రామప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పికిల్‌బాల్‌కు మంచి ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ ఆటలో మంచి అవకాశాలున్నాయని చెప్పారు. విజయవాడ 'అమరావతి పికిల్‌బాల్ టోర్నమెంట్'కు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పికిల్‌బాల్ ఆదరణ పెరుగుతుందన్నారు. పికిల్ బాల్‌కు ఉత్సాహంగా స్పాన్సర్స్ కూడా ముందుకు వస్తున్నారన్నారు. పికిల్‌బాల్‌ను స్పోర్ట్స్ అథారిటీ పరిధిలోకి తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ అమరావతి టోర్నమెంట్‌ను విజయవాడలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అమరావతి పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చినవారు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు.శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ పికిల్‌బాల్ టోర్నమెంట్‌ను చాలా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంటును మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఈ స్టేడియంను చూస్తే తెలుస్తోందన్నారు. ఊహించని విధంగా పికిల్‌బాల్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. పికిల్‌బాల్ క్రీడా కారులందరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసోసియేషన్‌గా ఏర్పడితే శాప్ గుర్తింపు కల్పిస్తుందని తెలిపారు. సినిమా హీరో సుశాంత్ మాట్లాడుతూ పికిల్‌బాల్ ఆట చాలా వేగంగా అందరి అభిమానాన్ని చూరగొందని అన్నారు. గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యత

# ప్రతి అర్జీపై తక్షణ చర్యలు. ఎమ్మెల్యే బొండా ఉమా

**విజయవాడ, ఆగస్టు 7 , నేటి శుభోదయ :**



అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను విన్నారు. ప్రతి సమస్యను పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రజలకే ప్రభుత్వం చేరువ కావాలనే లక్ష్యంతో ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు నమ్మకంతో తమ సమస్యలను తమ ముందుకు తీసుకువస్తుండటం తమపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.ప్రతి వినతిని బాధ్యతతో స్వీకరించి సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పరిష్కారం వచ్చే వరకు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అనే విషయాన్ని కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఉమా వెల్లడించారు.ప్రజా దర్బార్ ప్రారంభమైన తొలి రోజుల్లో అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చేవని, ప్రస్తుతం చాలా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతుండటంతో ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఇది ప్రజాప్రతినిధిగా తమ పనితీరుపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఉమా తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, భవిష్యత్తులో కూడా సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి

- వన్ మంత్ – ఫోర్ విజిట్" లో భాగంగా ఉదిరిపికొండలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్
- ప్రత్యేక పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం

**అనంతపురం బ్యూరో, ఆగస్టు 7, నేటి శుభోదయ :** అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.శుక్రవారం కూడేరు మండలం లోని కుదిరిపికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం అనంతపురం ఆర్ డి ఓ ప్రేమత కుమార్ తో కలిసి "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదికకార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అధికారులు ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందన్నారు.ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడేపరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాగే చట్టపరంగా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో



ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామనిజిల్లా తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశించారు. కోర్టు కేసులు మినహాయించి మొత్తం 219 ఫిర్యాదులు రాగా ఇందులో 139 వరకు పరిష్కరించబడినవని 80 వరకు వివిధ కారణాలవల్ల తిరస్కరించ బడినవని ఇంకనూ 58 దాకా ఉన్న ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూడేరు తాసిల్దార్ మోహన్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జిలాన్ భాష, సిడిపిఓ శ్రీదేవి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సురేఖ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ రమణయ్య, ఏపీవో పోలేరయ్య, స్థానిక నాయకులు మహేష్ జల్లిపల్లి చంద్ర,గ్రామ ప్రజలు అర్జీదారులుతదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో దేశం కోసం మధ్య వర్తిత్వం 3.0

**మాచర్ల, ఆగస్టు 07, నేటి శుభోదయ :** మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0కార్యక్రమం . మధ్యవర్తిత్వం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకొని ప్రశాంతమైన జీవనం కొనసాగించవచ్చని మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు, పల్నాడు జిల్లా దిశ కమిటీ మెంబర్ మరియు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు . దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0లో భాగంగా శుక్రవారం మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ చిన్న ,చిన్న సమస్యలకు గొడవలు పెట్టుకుని కక్షలు, కార్పన్యాలకు లోనై జీవితాన్ని నాశనం చేసుకోకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. కేంద్ర న్యాయ సేవా కమిటీ వారి యొక్క ఆదేశాల మేరకు ,రాష్ట్ర న్యాయ సేవా కమిటీ వారి ఆదేశాల మేరకు మరియు జిల్లా న్యాయ సేవ కమిటీ వారి ఆదేశాల మేరకు మాచర్ల మండల న్యాయ సేవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఆగస్టు 1 తేదీ నుండి 7 తేదీ వరకు గ్రామాలలో దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0 కార్యక్రమం పై అవగాహన ఏర్పాటు చేస్తున్నట్లు గోవింద రెడ్డి తెలిపారు. అనంతరం జమ్మలమడక గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని ,విద్యార్థులు చేత ర్యాలీ నిర్వహించి జమ్మలమడక గ్రామంలోని ప్రజలకు దేశం కోసం మధ్యవర్తిత్వం 3.ఓ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచిపెట్టారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గొడవలు పెట్టుకోకుండా నైతిక ఆధ్యాత్మిక విలువలతో మెలగాలని మీరు గొడవలు పెట్టుకుని ఆ గొడవలను మీ తల్లిదండ్రుల దగ్గరకు తీసుకెళ్లి వాటిని పెద్దవి చేసి పోలీస్ స్టేషన్ల చుట్టూ ,కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడవద్దు అని గోవింద రెడ్డి తెలియజేశారు.





అంతేకాకుండా మీరు ఇక్కడ జరిగినటువంటి దేశం కోసం మధ్యత్వం 3.o కార్యక్రమాన్ని మీ తల్లిదండ్రులకు తెలియజేసి పోలీస్ స్టేషనులకు , కోర్టులకు వెళితే వచ్చేటటువంటి ఇబ్బందులు వారికి తెలియజేసి మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని మీరు తల్లిదండ్రులకు తెలియజేయాలని గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటెన్షిప్ చేస్తున్న జూనియర్ లాయర్ రాజేశ్వరి ,పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఆర్. బుచ్చిబాబు, సిహెచ్ కెనడీ మాస్టారు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ,విద్యార్థిని ,విద్యార్థులు జమ్మలమడక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ జగన్మాత సన్నిధి

**విజయవాడ, ఆగస్టు 7 , నేటి శుభోదయ :** కాఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నుండి అమ్మవారి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం :3 గంటల వరకు అంతరాలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. వీఐపీ దర్శనాలను కూడా పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం లభించింది. ఆలయంలో నిర్వహించిన అమ్మవారి సారె /చీరల సమర్పణ కార్యక్రమం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులతో అత్యంత వైభవంగా, పెద్ద ఎత్తున సాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వి.కే. సీనా నాయక్ నిరంతరం పర్యవేక్షించారు. రద్దీ దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తులకు నిరంతరాయంగా మొబైల్ వాహనాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే లైన్లలో వేచి ఉన్న భక్తులందరికీ ఉచిత ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు, అన్నప్రసాద



భవనంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈఓ స్వయంగా కంట్రోల్ రూమ్ నుండి వైర్లెస్ సెట్లు, సీసీటీవీ, కెమెరాల ద్వారా క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పర్యవేక్షించారు. అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించడంతో భక్తుల దర్శనం ప్రశాంత వాతావరణంలో ముగిసింది.పల్లవి హెచ్చరించారు.

## ఇంద్రకీలాద్రిపై 'ధర్మపథం' సాంస్కృతిక కార్యక్రమం




**విజయవాడ, ఆగస్టు 7, నేటి శుభోదయ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ( ఇ ంద్రకీలాద్రి) ధర్మపథం – సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుండి రాజగోపురం ముందు గల కళావేదికపై నృత్య ప్రదర్శన వైభవంగా జరిగింది.విజయవాడకు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి బి.స్వర్ణలత బృందం అభినయించిన 'కూచిపూడి నృత్య ప్రదర్శన' అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులను విశేషంగా అలరించింది.ఈ ప్రదర్శనలో భాగంగా వివిధ భక్తిపూరిత కీర్తనలు, వర్ణనలకు అనుగుణంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తిభావభరితంగా సాగాయి.మూషిక వాహన, జయ జయ, చక్కని తల్లిఅంతా రామమయం ముద్దుగారే యశోదతాండవకృష్ణ, పలుకే బంగారమాయెనాఇదిగో భద్రాద్రి జతి స్వరంఅంశాలు దర్శనానికి విచ్చేసిన భక్తులు తిలకించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ప్రదర్శన అనంతరం కళాకారిణి స్వర్ణలత వారి బృందాన్ని దేవస్థాన అధికారులు అభినందించి గౌరవించారు.

## మార్కెట్ల అభివృద్ధి, పచ్చదనం పెంపు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆగస్టు 7, నేటి శుభోదయ :** మార్కెట్ల అభివృద్ధి, నూతన భవన నిర్మాణం, పచ్చదనం పెంపు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా మధురానగర్, వాంబే కాలనీ, అజిత్ సింగ్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాలను సందర్శించి అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా అజిత్ సింగ్ నగర్ స్టేడియం వద్దగల చేపల మార్కెట్‌తో పాటు విజయవాడ నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాన్ని కమిషనర్ పరిశీలించారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, స్థానిక వ్యాపారులు, మార్కెట్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, వాణిజ్య సముదాయం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మధురానగర్‌లోని విజయవాడ నగరపాలక సంస్థ పాత భవనాన్ని పరిశీలించిన కమిషనర్, శిథిలావస్థకు చేరుకున్న ఆ భవనాన్ని తొలగించి, ఆ స్థానంలో ఆధునిక సౌకర్యాలతో జీ ప్లస్ వన్ (G+1) భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిర్మాణ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్‌ను పరిశీలించిన కమిషనర్, అక్కడ ఉన్న గ్రీనరీని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. రహదారి వెంబడి విస్తృతంగా మొక్కలు నాటడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలన్నారు. అజిత్ సింగ్ నగర్లో గల అన్నా క్యాంటీన్ లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి సమస్యనైనా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీస్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### అగ్నిమాపక పరికరాల వినియోగంపై విఎంసి ఫైవ్ సిబ్బంది విస్తృత అవగాహన



**విజయవాడ, ఆగస్టు 7,నేటి శుభోదయ :** అగ్నిమాపక పరికరాల వినియోగంపై విఎంసి ఫైర్ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం రీజనల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ రత్నబాబు తమ సిబ్బందితో గురునానక్ కాలనీలోని ఎరువాక టెక్నాలజీస్ సంస్థను సందర్శించి, అగ్నిమాపక పరికరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడున్న వారికి వాటి వినియోగం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి సంస్థలో అగ్నిప్రమాదాలను నివారించేందుకు అవసరమైన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ నుండి అవసరమైన అనుమతులు పొందే సంస్థలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉద్యోగులు, సందర్శకుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సంస్థలో ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ అలారం వ్యవస్థ, ఎమర్జెన్సీ స్పందన ఏర్పాట్లు, అత్యవసర నిష్క్రమణ (ఎమర్జెన్సీ ఎగ్జిట్) మార్గాలను పరిశీలించారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఎలా వినియోగించాలి, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది ఎలా స్పందించాలనే అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలు ప్రతి ఒక్కరికీ స్పష్టంగా కనిపించేలా దిశా సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉంచాలని, సిబ్బందికి తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో వీఎంసీ ఫైర్ విభాగం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ పథకాలపై అవగాహన కార్యక్రమం




**విజయవాడ, ఆగస్టు 7,నేటి శుభోదయ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పటమట సర్కిల్-3 కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తల కోసం సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పథకాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్ఎంఈ ఫోరం డైరెక్టర్, కేంద్ర సూక్ష్మ, ఎం ఎస్ ఎం ఈ మంత్రిత్వ శాఖ అడ్వైసరీ సభ్యురాలు సుష్మ ముఖ్య అతిథిగా హాజరై మహిళా పారిశ్రామికవేత్తలతో వ్యక్తిగతంగా సమావేశమై వారి వ్యాపార కార్యకలాపాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యాపార విస్తరణకు అవసరమైన ఆర్థిక సహాయం, రుణాల పొందడంలో ఎదురయ్యే ఇబ్బందులపై వివరంగా చర్చించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి ముద్ర యోజన వంటి పథకాల గురించి సమగ్రంగా వివరించారు. అర్హులైన మహిళా పారిశ్రామికవేత్తలు ఈ పథకాల ద్వారా రుణాలు పొందేందుకు అవసరమైన మార్గదర్శకాలు, దరఖాస్తు ప్రక్రియ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవకాశాలపై అవగాహన కల్పించారు.వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలనే ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళల వివరాలను సేకరించి, వారికి రుణ సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు మరియు ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల ద్వారా తదుపరి చర్యలు చేపడతామని సుష్మ అన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళల వ్యాపారవేత్తలు పథకాలపై సమగ్ర సమాచారం అందడంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తమ వ్యాపార అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో షీలా శ్రీనివాస్, డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రాజెక్ట్, భవ్య శర్మ, డైరెక్టర్ (ట్రైనింగ్), ISF, వివిఎంసి లైవ్లీహుడ్ ఎక్స్పర్ట్ సుజాత, సి డి ఓ ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



**విజయవాడ, ఆగస్టు 07, నేటి శుభోదయ :** విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం బ్రాహ్మణా స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై, పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు హెల్త్ అసిస్టెంట్ లీలా శ్రీనివాస్, నాగేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యామ్, హెల్త్ సూపెర్వైసోర్ శివశంకర్ ,శ్రీనివాస్,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా




**విజయవాడ, ఆగస్టు 7, నేటి శుభోదయ :** విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-1 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు.ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 23 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ. 6,750 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు డి. సోమరాజు, ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వ హయాంలో సమంగా సంక్షేమం, అభివృద్ధిమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్దె, శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు



**విజయవాడ, ఆగస్టు 7, నేటి శుభోదయ :** ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు చెప్పారు.శుక్రవారం ఉదయం తూర్పు లోని 4వ డివిజన్‌లో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమం జరిగింది. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే గద్దె, శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు ఈ కార్యక్రమములో పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. రెండు సంవత్సరాల కూటమి పాలనలో ప్రజలకు చేసిన సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేసేందుకు టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కూటమి ప్రభుత్వ పాలనలో చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు తమతో చెబుతున్నారని అన్నారు. గద్దె మాట్లాడుతూ తూర్పు లో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ ఇంటి ముందుకు తీసుకువచ్చి అందచేస్తున్నారని ప్రజలు స్వాగతం పలుకుతూ వచ్చి చెబుతున్నారన్నారు. ప్రతి ఇంటి దగ్గర సుమారు మూడు నిమిషాల సమయాన్ని వెచ్చించి, వారితో మాట్లాడి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి చెప్పడమే కాకుండా వారి సమస్యలను కూడా తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని అన్నారు.శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనకున్న సమర్థతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పయనించేలా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాస్తి సాంబశివరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ, మమ్మునేని ప్రసాద్, కోదూరు ఆంజనేయవాసు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, షేక్ షరీఫ్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిష్టిపాడులో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం - సీనియర్ చేనేత కార్మికులకు సన్మానం





**పెద్దవడూగురు ఆగష్టు 07 ,నేటి శుభోదయ :** మండలంలోని క్రిష్టిపాడు రైతు భరోసా కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, వారి ప్రతిభకు గుర్తింపుగా సర్టిఫికెట్లు, శాలువాలు అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు కాశెట్టి శ్రీనివాసులు, చారుగండ్ల వెంకటంరాముడు, అన్నం వెంకటరాముడు, సయ్యద్ పెద్ద మస్తాన్ వలి, బద్దెల రాజీవ్‌లను అధికారులు, ప్రజాప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు.అనంతరం న్యూఢిల్లీలో జరుగుతున్న 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తెర ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ఈ కార్యక్రమం అనంతరం హాజరైన చేనేత కార్మికులకు భోజన వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సహాయకులు డి. రమణారెడ్డి, విలేజ్ రెవెన్యూ అధికారి రామాంజనేయులు, డిజిటల్ సహాయకులు విజయ భాస్కర్, ఇంజనీరింగ్ సహాయకులు గంగాధర్, గ్రామ పోలీస్ దివ్యతో పాటు సీనియర్ చేనేత కార్మికులు గుండా శ్రీనివాసులు, కాలూరు శివశంకర్, పి. రంగస్వామి, పోసా రామప్ప, షేక్షావలి, బి. రామాంజనేయులు, బి. చౌడప్ప, పోల రంగ, కాలూరు శంకర తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు చేస్తామని తెలిపారు

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## కబడ్డీ పోటీల్లో విజన్ పాఠశాల ప్రతిభ : జిల్లా స్థాయికి ఎంపిక



**యాడికి, ఆగస్టు 07, నేటి శుభోదయ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అనంత ఛాంపియన్స్ కప్ – 2026' నియోజకవర్గ స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో యాడికి పట్టణానికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పోటీల్లో యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో విజన్ పాఠశాల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.జిల్లా స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల విజన్ హై స్కూల్ కరెస్పాండెంట్ విశ్వనాథ్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో ప్రతిభ చాటి పాఠశాలకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చిన క్రీడాకారులను ఉపాధ్యాయులు అమర్, శేఖర్, కోటితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జిల్లా స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వాలని పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు..

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

### - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి - మాజీ మంత్రి వెలంపల్లి



**విజయవాడ, ఆగస్టు 07, నేటి శుభోదయ :** రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగిన తీవ్ర అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన 'యువగళం' హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా విజయవాడ పశ్చిమలోని 35వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ దీక్షలో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు మరియు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ విద్యార్థులు, యువత హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా దీక్ష చేపడుతుంటే, కూటమి నేతలు సమాధానం చెప్పలేక ధర్నాలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగ భృతి రూ. 3,000 ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీల అమలులో ఘోరంగా విఫలమైనందుకు , డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బోండా ఉమా ప్రవర్తన రౌడీలాగా ఉందే తప్ప ఎమ్మెల్యే లాగ లేదని ధ్వజమెత్తారు.రాజకీయాధికారాన్ని అడ్డుపెట్టుకుని రోడ్లపై తిరగనివ్వమని హెచ్చరిస్తే భయపడే ప్రసక్తే లేదని వెలంపల్లి స్పష్టం చేశారు. "నేను మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు వారసత్వంలో జన్మించిన వాడిని, ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమే కానీ బెదిరింపులకు లొంగను" అని తెగేసి చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా విద్యార్థులు, నిరుద్యోగుల తరపున వైఎస్సార్‌సీపీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రూహుల్ల, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి , పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, మాజి చైర్మన్ లు బండి పుణ్యశీల, కర్నాటి రాంబాబు, తోలేటి శ్రీకాంత్, గౌస్ మొహిద్దీన్, మాజీ కార్పొరేటర్ లు కోటిరెడ్డి, చైతన్య రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, యువత, విద్యార్థులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, క్లస్టర్, డివిజన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## అత్తింటి వేధింపులతో వితంతు మహిళ ఆవేదన..!

### - న్యాయం కోసం బిక్షాటన, నిరాహార దీక్షకు సిద్ధం..!



**కోరుకొండ, ఆగస్టు 07, నేటి శుభోదయ :** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలో ఓ వితంతు మహిళ తనకు, తన ఇద్దరు చిన్నారులకు న్యాయం చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అత్తింటి వేధింపుల కారణంగా తాము నిలువనీడ లేకుండా పోయామని ఆరోపిస్తూ, అవసరమైతే కుటుంబ సమేతంగా బిక్షాటన చేపట్టింది అనంతరం నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించింది. శుక్రవారం కోరుకొండలో మీడియా సమావేశంలో బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. భర్త మృతి చెందిన అనంతరం అత్తమామలు లేకపోవడంతో తన ఆడపడుచులు, వారి భర్తలు తనను అత్తింటి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. గతంలో తనపై భౌతిక దాడి చేసి గాయపరిచారని, దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపింది.తన తల్లిదండ్రులపై కూడా దాడి చేసి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశారని, తన ఇద్దరు చిన్నపిల్లలకు రావాల్సిన చట్టబద్ధమైన హక్కులను కూడా అడ్డుకుంటున్నారని వాపోయింది. మానసికంగా వేధింపులకు గురిచేస్తూ ఒంటరిగా చేస్తున్నారని కన్నీటి పర్యంతమైంది. స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేసింది. న్యాయం కోసం బిక్షాటన చేస్తున్నానని, అవసరమైతే నిరాహార దీక్ష చేపడతానని స్పష్టం చేసింది. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే మార్గమవుతుందేమోనన్న ఆందోళనను కూడా వ్యక్తం చేసింది.బాధిత కుటుంబానికి అండగా పాస్టర్ మోజెస్ బాబు ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి మద్దతుగా కోరుకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాస్టర్ మోజెస్ బాబు మాట్లాడుతూ..... భర్తను కోల్పోయిన ఈ మహిళకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నప్పటికీ వారికి రావాల్సిన చట్టబద్ధమైన హక్కులను నిరాకరిస్తున్నారని ఆరోపించారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అవసరమైతే బాధిత కుటుంబానికి మద్దతుగా తాను కూడా నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు..

## భీమిలి పోలీసుల మెగా దాడి..



**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :** భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ ఆదేశాల మేరకు రాబడి సమాచారం ఆధారంగా భీమిలి పోలీసులు బెల్ట్ షాపులపై విస్తృత దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 6 మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మొత్తం 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసిన వివరాలు:**

1. అమరాన నూకరాజు, గంటస్తంభం, భీమిలి – 6 బాటిళ్లు
2. కారి నర్సి నర్సియ్యమ్మ, ఎగువపేట – 8 బాటిళ్లు
3. పుక్కల్లా దాసు, ఎగువపేట – 14 బాటిళ్లు
4. జల్లలమూడి జయకృష్ణ, చిన్న బజారు – 9 బాటిళ్లు
5. కనగళ్ల మసేను, సంగివలస – 11 బాటిళ్లు
6. కోడిమాలి రాజు, సంగివలస – 7 బాటిళ్లు

నిందితులపై ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదుచేసి తదుపరి విచారణ చేపట్టారు.అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తప్పవని సి.ఐ హెచ్చరించారు.

## హైడ్రా కమీషనర్ రంగనాథ్ క్షమాపణ చెప్పాలి

### : నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి



**ఘట్కేసర్, ఆగస్టు 07, నేటి శుభోదయ :** అకారణంగా, ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా తన పరువుకు భంగం కలిగిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్ తనకు క్షమాపణలు చెప్పాలని నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధి నారపల్లి దివ్యా నగర్ లో నల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ ... 2025 జనవరి 25 న హైడ్రా అధికారులు నారపల్లి దివ్యానగర్ లోని తన ఇళ్లు, పొలాలు,అసోసియేషన్ గోడలు కూలగొట్టడమే కాకుండా, తాను కట్టిన నాలుగు కిలోమీటర్ల గోడను కూల్చివేశామని హైడ్రా కమీషనర్ అబద్ధాలు ఆడారని అన్నారు. అంతే కాకుండా నల్ల మల్లారెడ్డి ఆక్రమించిన రెండు వేల రెండు వందల ప్లాట్లను రిలీజ్ చేశామని, వంద కోట్ల విలువైన ఆరున్నర ఎకరాల భూములను స్వాధీనం చేసున్నామంటూ, సోషల్ మీడియాలో తన ఫోటో వేసి తన పరువుకు భంగం కలిగించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్ వెంటనే క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో తాము తీసుకుని లీగల్ యాక్షన్ కు సిద్ధంగా ఉండాలని నల్ల మల్లారెడ్డి హెచ్చరించారు.

## ఏపీలోని అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్..




**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ** ఏపీలో అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. బాధితులకు న్యాయం చేసేందుకు సంస్థకు చెందిన 6,330 ఎకరాల భూములను తొలి విడతలో బహిరంగ వేలం వేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ నెలలోనే వేలం విధివిధానాలు ఖరారు చేసి, సెప్టెంబర్ 15 నాటికి బాధితులకు తొలి విడత సొమ్మును పంపిణీ చేయనుని పేర్కొన్నారు. అలాగే కేసు పరిష్కారం కోసం ఈ నెల 15 నాటికి ప్రత్యేక కోర్టు భవనం కూడా సిద్ధం కానుంది.

# విహారయాత్రలో విషాదం



**చింతూరు, ఆగస్టు 07, నేటి శుభోదయ :** చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోగల సోకిలేరు వ్యూ పాయింట్, తదితర పకృతి అందాలను చూడడానికి ఖమ్మం జిల్లా నందిగామ కు చెందిన 10 స్నేహితులతో కలసి చెరుకూరి శివరామ కృష్ణ వచ్చారు. వ్యూ పాయింట్ చూసిన అనంతరం సోకులేరులో స్నానం చేయడానికి దిగారు. ప్రమాదవశాత్తు శివరామకృష్ణ (32) సోకులేర్లో మృతి చెందాడు. మృతదేహాన్ని చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోతుగూడెం ట్రెడిషనల్ ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇద్దరికీ అందజేత

**పెంటపాడు, ఆగస్టు 07, నేటి శుభోదయ :** పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో ఇద్దరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. జట్లపాలెం గ్రామానికి చెందిన నిచ్చెనకొల్ల సరస్వతి అనారోగ్యం బారిన పడి హస్పటల్ లో వైద్యం చేయించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన చెరుకు వెంకటలక్ష్మి అనారోగ్యంతో వైద్యం చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు కుదుళ్ల చంద్రశేఖర్ తాడేపల్లిగూడెం టిడిపి ఇన్చార్జ్ ఉలవల మల్లికార్జునరావు బాబ్జి దృష్టికి తీసుకువెళ్లారు ఆయన స్పందించి సిఎంఆర్ఎఫ్ సహాయం కోసం పంపించారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిచ్చెనకొల్ల సరస్వతికి 30,000/- ( 30 వేల రూపాయలు, చెరుకు వెంకటలక్ష్మి ), 1,44,480!-(లక్ష నలభై నాలుగు వేల నాలుగువందల ఎనభై ) అక్షరాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కుదుళ్ల చంద్రశేఖరకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ పలువురు అభినందించారు.

# పాత్రికేయుల సమస్యలను నవంబర్ 2వ తేదీలోగా పరిష్కరించుకుంటే ఉద్యమం చేపడతాం




**మోపిదేవి, ఆగస్టు 7, నేటి శుభోదయ :** పాత్రికేయుల సమస్యలను నవంబర్ 2తేదీలోగా పరిష్కరించకుంటే ఉద్యమాన్ని చెప్పడతామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం మోపిదేవి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా వ్యవహరిస్తున్న పాత్రికేయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పాత్రికేయ వృత్తిలో ఏళ్ళనుంచి చేస్తున్న ప్రతి పాత్రికేయునికి పక్క రాష్ట్రాలు ఇచ్చే విధంగా 10వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా రెండేళ్లు గడుస్తున్నా పాతయించుకోవడం లేదని అన్నారు.హెల్త్ కార్డులు పునరుద్దరణ జరిగినా 2 లక్షలకు పరిమితం చేసారని దానిని 25 లక్షలకు పెంచాలని కోరామని, దానికి మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారని, అలాగే ఇళ్ల స్థలాలు, నిర్మాణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కొరటు. కేంద్రప్రభుత్వం గతంలో పాత్రికేయులకు ఇచ్చే పాసులను నిలిపేసిందని దానిని పునరుద్దరించాలని ఇటీవల పార్లమెంట్ లో ఎం. పి. లు కేంద్రప్రభుత్వానికి వినతి పత్రం ద్వారా పాత్రికేయులకు రైల్వే పాసులు పునరుద్దరించాలని కోరారన్నారు. పాత్రికేయుల సంక్షేమ పథకాలను సాధించుకునేందుకు అన్ని పాత్రికేయ సంఘాలను కూడగట్టుకుని ముందుకు సాగుతామని అన్నారు. నవంబర్ 2వ తేదీలోగా పాత్రికేయుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని చేపడతామన్నారు. సమావేశంలో కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీధర్, సహాయ కార్యదర్శి ఉప్పాల మోహనకృష్ణ, గౌరవ సలహాదారు తలశిల నాగేశ్వర రావు, జనరల్ సెక్రటరీ కొండపల్లి శ్రీనివాసరరావు, మోపిదేవి మీడియా ప్రతినిధులు పేరాటి యేసు తులసిరామ్, ఉప్పాల సుబ్బారావు, మోపిదేవి రాఘవేంద్రరావు, సామనపల్లి లక్ష్మణ్ బాబు తదుతరులు పాల్గొన్నారు.

# కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో వైభవంగా శ్రీ దుర్గమ్మ వారి జాతర..!

## - భక్తిశ్రద్ధలతో సారె సమర్పించిన శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి..!

**కోరుకొండ, ఆగస్టు 07, నేటి శుభోదయ :** రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం, మధురపూడి గ్రామంలో కొలువై ఉన్న శక్తి స్వరూపిణి శ్రీ దుర్గమ్మ వారి జాతర మహోత్సవం అత్యంత ఘనంగా మరియు భక్తిభావంతో ప్రారంభమైంది. ఈ పవిత్ర జాతర సందర్భం పురస్కరించుకుని, రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి అమ్మవారికి అత్యంత భక్తిప్రపత్తులతో బోనం (సారె) సమర్పించారు.మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామస్తులందరూ ఉత్సాహంగా పాల్గొనగా, వెంకటలక్ష్మి తలపై బోనం ధరించి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజల క్షేమం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.





# ఏసీబీ వలలో చిక్కుకున్న భారీ తిమింగలం..

## - ఈ ఏసీబీ దాడుల్లో పాల్గొన్న అడిషనల్ ఎస్పి హర్షిత, డీఎస్పీ నారాయణమూర్తి...

**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :** అనకాపల్లి జిల్లా, గనులు శాఖ సర్వేయర్ డి. మురళీకృష్ణ అంబేద్కర్ 5 లక్షలు లంచం తీసుకుంటడుగా పట్టుకున్న ఏసీబీ అధికారులు...ఉదయం సుమారు 11:00 గంటలకు అనకాపల్లి జిల్లా ఏడీ గనులు అండ్ భూగర్భశాస్త్ర శాఖ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఫిర్యాదు దారుడు దగ్గర నుండి నగదుతో ఏసీబీ అధికారులకు చిక్కిన మురళీ కృష్ణ...అనకాపల్లి మండలం ఊడేరు రెవిన్యూ 211 సర్వే నెంబర్లు రెండు హెక్టార్ల క్వారీ లీజు దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ దారుడు ఎస్. సునీల్ వద్దనుండి సర్వే నిమిత్తం 15 లక్షలు డిమాండ్ చేయగా ఐదు లక్షల రూపాయలు అడ్వాన్స్ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు...సర్వేయర్ మురళీకృష్ణ 2008లో సర్వేయర్గా అయినప్పుడు నుండి టెక్కలి,విశాఖపట్నం, ఏలూరు, అనకాపల్లి, పాడేరులలో పనిచేశారు.. గతంలో 2018 లో 50,000 లంచంతో రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారని, దీని తర్వాత, విధులను నిర్లక్ష్యం చేసినందుకు 2021లో అతడిని మళ్లీ



సస్పెండ్ చేసి, 2023లో తిరిగి విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు..ప్రభుత్వ శాఖలలో జరిగే ఏవైనా అవినీతి సంఘటనలను తమ తమ స్థానిక ఏసీబీ కార్యాలయాలకు గానీ, ఏసీబీ టోల్-ఫ్రీ నెం. 1064కు గానీ, ఏసీబీ మొబైల్ నెం. 9440440057కు గానీ, లేదా ఏసీబీ ఈమెయిల్ ఐడి complaints-acb@ap.gov.in ద్వారా గానీ తెలియజేయాలని ఏసీబీ ప్రజలను కోరుతోంది.

# బూడిద లో పోసిన ప్రభుత్వ నిధులు

**చింతూరు, ఆగస్టు 07, నేటి శుభోదయ :** విద్యార్థుల భద్రతకు నిలయంగా ఉండాల్సిన ప్రభుత్వ పాఠశాల భవనం... ఇప్పుడు నాణ్యత లోపాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. చింతూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో సుమారు రూ.2.55 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు వసతి గృహ భవనంలో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.నిర్మాణంలో ఉపయోగిస్తున్న ఇటుకలు వర్షానికి తడవగానే కరిగిపోయేంత నాసిరకంగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకలుగా కాకుండా బూడిద ముద్దలను గోడల్లో పేర్చుతున్నట్టుగా పరిస్థితి ఉందని విమర్శిస్తున్నారు.ఇంత నాశిరకంగా పనులు జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా పనులను పర్యవేక్షించడానికి రాలేదని అక్కడ పనులు చేస్తున్న కూలీలు చెప్పడం చాలా విడ్డురం గా ఉంది. ఇదిలా ఉండగా ఒక్కో సిమెంట్ బస్తకు 20 గేమలాల ఇసుక వాడాల్సి ఉండగా 40గమీలాల ఇసుకను కలుపుతున్నాం అని అక్కడి మేస్త్రీలు చెప్పడం పై ఎంత నాశిరకంగా కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నారో అధికారులు అర్థం చేసుకోవాలి. అలాగే టెండర్ లా ఇచ్చిన లీడ్ నుండి కాకుండా చిన్న వాగులు, వంకల నుండి మట్టితో కలిసిన ఇసుకను కట్టుబడికి వాడుతున్నారు.అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఈ నిర్మాణం ఐటిడిఏ కార్యాలయానికి అతి సమీపంలోనే జరుగుతోంది. జిల్లాలో కీలక అధికారులు నిత్యం తిరిగే ప్రాంతంలోనే పనులు సాగుతున్నప్పటికీ, నిర్మాణ నాణ్యతను పరిశీలించిన దాఖలాలు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.నిర్మాణ పనులు చేస్తున్న కూలీలను ప్రశ్నించగా, "మా వద్దకు ఇప్పటివరకు ఏ ఇంజినీరు వచ్చి పనులు పరిశీలించలేదు. మాకు చెప్పినట్లే నిర్మాణం చేస్తున్నాం" అని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు పర్యవేక్షణ వ్యవస్థపై మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి.చింతూరు ప్రాంతం అధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతం







కావడంతో, నాసిరకం ఇటుకలతో నిర్మించిన గోడలు భవిష్యత్తులో ఎంతవరకు నిలబడతాయన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ భవనంలో భవిష్యత్తులో గిరిజన బాలికలు నివసించనున్న నేపథ్యంలో, ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇకనైనా జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భవనాన్ని పునరనిర్మాణం చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

## పోక్సో కేసు నందు నిందితుడికి 20 సం.ల కఠిన కారాగార శిక్ష..!!

**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :**
2024 సంవత్సరం నందు గాజువాక పోలీసు స్టేషన్ పరిధిలో 20/04/2024 న జరిగిన ఘటనలో మైనర్ బాలిక తల్లి 07/05/2024 న ఇచ్చిన ఫిర్యాదులో తమకు ముగ్గురు కుమార్తెలు కాగా ఇద్దరికీ పెళ్లిళ్లు అయినవి, చివరి కుమార్తె మరియు బాధితురాలు(10 సం. లు) 05 వ తరగతి చదువు తున్నది, నిందితుడు కే.కృష్ణ కుమార్ ( 22 సం.లు) తమ పెద్ద అల్లుడు కాగా, 20/04/2024 న నేను నా చిన్న కుమార్తె తో వారి ఇంటికి వెళ్లడం జరిగింది, అనంతరం నా చిన్న కూతురును ఇంటి బయట అరుగు పై ఉంచి, సాయంత్రం 06:30 సమయంలో నేనూ, నా పెద్ద కూతురు మార్కెట్ వెళ్లగా, నిందితుడైన తమ అల్లుడు తమ చివరి కుమార్తె మరియు బాధితురాలును బలవంతంగా లోపలకు తీసుకు వెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు, ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు, తిరిగి తమ ఇంటికి వెళ్లగా బాధితురాలికి రక్త స్రావం అవుతుండడంతో పలు ఆసుపత్రిలలో చూపి, చివరగా ఒక ప్రముఖ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, వైద్యులు పరీక్షించి మల ద్వారం గుండా లైంగిక దాడికి గుర్రైందని తెలుపగా, బాధితురాలిని గట్టిగా అడుగగా, ఫలానా రోజున తన బావ అయిన కే.కృష్ణ కుమార్ తనపై లైంగిక దాడికి పాల్పడి, బెదిరించాడు అని తెలిపింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది.అనంతరం కేసు మహిళా పోలీసు స్టేషన్ తరలించి విచారణ చేయడం జరిగినది.గురువారం ఈ కేసులో విశాఖ పట్నం గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు వారు గాజువాక పోలీస్ స్టేషన్ క్రైమ్ .నెంబర్ .263/2024 యూ /ఎస్ .376- ఎఫ్ , 376(ఏ )(బి ) ఐపీసీ , సెక్షన్ .5 (ఎం ) ఆర్ / డబ్ల్యు .6 అఫ్ పోక్సో చట్టం నందు విచారణ ముగిసిన తర్వాత నిందితుడు కోరిబిల్లి కృష్ణ కుమార్(22 సం) లకు 20సం.ల కఠిన కారాగార శిక్ష మరియు రూ.25000/- జరిమానా చెల్లించాలని, అందులో 20,000/- బాధితురాలికి అందజేయాలనీ, ప్రభుత్వం నష్ట పరిహారంగా 1,00,000/- బాధితురాలికి అందజేయాలనీ తీర్పు వెలువరించిన గౌరవ న్యాయస్థానం.

## వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పటాస్ శ్రీకాంత్



**అనంతపురం, ఆగస్టు 07, నేటి శుభోదయ :**
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి , సోషల్ మీడియా యాక్టివిస్ట్ పటాస్ శ్రీకాంత్ [అలియాస్ కురుబ చిట్రా శ్రీకాంత్] గురువారం తాడేపల్లిలో కలిసి ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై చర్చించారు.ఇటీవల మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఉద్దేశించి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పటాస్ శ్రీకాంత్ విలేకరుల సమావేశం నిర్వహించి పలు అంశాలపై ప్రశ్నించిన విషయం తెలిసిందే. అనంతరం తనపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసి మూడు రోజుల పాటు వేధింపులకు గురిచేశారని, ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైందని అధినేత దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఘటనపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు.. ప్రభుత్వం ఒత్తిడితో పోలీసులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, చెప్పలేని పదజాలంతో దూషించారని పటాస్ శ్రీకాంత్ వివరించినట్లు తెలిపారు..

## డీజే (డీజే ) నిర్వాహకులకు సీఐ శ్రీ చంద్ర మౌళి సూచనలు

**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :**
పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహాలు, శుభకార్యాలు, ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాలు, ఉత్సవాల సందర్భంగా డీజే (డీజే ) కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులతో పద్మనాభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మౌళి సమావేశం నిర్వహించి పలు ముఖ్యమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ చంద్ర మౌళి మాట్లాడుతూ, డీజే కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, సుప్రీంకోర్టు మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు శబ్ద పరిమితులను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో నిర్ణీత సమయం దాటిన తర్వాత అధిక శబ్దంతో డీజేలు నిర్వహించరాదని తెలిపారు.అదేవిధంగా, డీజే కార్యక్రమాల వల్ల ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని, అసభ్యకర పాటలు, అసభ్య నృత్యాలు, మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినా, అనుమతులు లేకుండా డీజేలు నిర్వహించినా, అధిక శబ్దంతో నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత నిర్వాహకులు మరియు బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకునేలా ప్రతి డీజే నిర్వాహకుడు పోలీసు శాఖ





సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ చంద్ర మౌళి విజ్ఞప్తి చేశారు.

## రాప్తాడు నియోజకవర్గంలో రెండో రోజు కొనసాగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ "రిలే నిరాహార దీక్ష"





**వైరా, ఆగస్టు 07, నేటి శుభోదయ :**
డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధిత నిరుద్యోగులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేడు రెండో రోజుకు చేరుకున్నాయి.రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపు మేరకు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ప్రధాన ద్వారం సమీపంలో నిర్వహిస్తున్న ఈ దీక్ష లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం, విద్యార్థి విభాగం, నిరుద్యోగ యువతతో పాటు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ–2025 నియామకాల్లో జరిగిన అవకతవకలపై స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నియామక ప్రక్రియపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు సీబీఐ దర్యాప్తుకు ఆదేశాలు ఇవ్వాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని, వారి హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 8వ తేదీ వరకు రిలే నిరాహార దీక్ష లు కొనసాగనున్నట్లు తెలిపారు.

## వెలంపేట స్లమ్ రీ-డెవలప్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం
## విశాఖ నగర అభివృద్ధిలో చారిత్రాత్మక మైలురాయి

**వైరా, ఆగస్టు 07, నేటి శుభోదయ :**
07 విశాఖ పట్టణ పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తూ మురికివాడలను ఆధునిక నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా, విశాఖ నగరంలోని వెలంపేట స్లమ్ రీ–డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని,ఆంధ్రప్రదేశ్‌లో వెలంపేట తొలి ప్రధాన స్లమ్ రీ–డెవలప్‌మెంట్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్ జి.ఓ.ఆర్.టి. నెం.1012, తేదీ 07.08.2026 ద్వారా జీవోను జారీ చేశారని, విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వి ఈ ఆర్ ) కార్యక్రమం కింద ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అమలుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.

### డీపీఆర్‌కు ప్రభుత్వ ఆమోదం

వెలంపేట స్లమ్ పునరాభివృద్ధి కోసం జీవీఎంసీ రూపొందించి సమర్పించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీ ఆర్ – వెర్షన్ 3.4)ను పరిశీలించిన అనంతరం, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీ యూ ఐ ఏ ఎం ఎల్ ) సూచనల మేరకు సవరించిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కమిషనర్ పేర్కొన్నారు.

### 177 కుటుంబాలకు ఆధునిక గృహాలు

ఈ ప్రాజెక్టు ద్వారా 177 గృహ యూనిట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. 1,986.45 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గరిష్టంగా 45 మీటర్ల ఎత్తుతో ఆధునిక బహుళ అంతస్తుల గృహ సముదాయాలు నిర్మించి, పట్టణ పేదలకు సురక్షితమైన, నాణ్యమైన నివాసాలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

### డి.బి.ఎఫ్.టీ – టీ.డి.ఆర్ విధానంలో వినూత్న అమలు

విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వి ఈ ఆర్ ) కార్యక్రమం కింద ఈ ప్రాజెక్టును డిజైన్–బిల్డ్–ఫైనాన్స్–ట్రాన్స్‌ఫర్ ( డి బి ఏఫ్ టీ ) విధానంలో జీవీఎంసీ అమలు చేయనుంది. నిర్మాణ వ్యయానికి బదులుగా 1:4 నిష్పత్తిలో టిడిఆర్ (ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ - టీడీ ఆర్ ) ను గరిష్ట బిడ్డింగ్ ప్రమాణంగా నిర్ణయిస్తూ పోటీ టెండర్ల ద్వారా డెవలపర్‌ను ఎంపిక చేయనున్నట్లు



కమిషనర్ తెలిపారు.

### ప్రత్యేక సడలింపులతో వేగవంతమైన అమలు

ఈ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్–2017లో ప్రత్యేక సడలింపులు మంజూరు చేసింది. భవన ఎత్తు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ నిబంధనలలో అవసరమైన సడలింపులతో పాటు జీవీఎంసీ, యూడీఏ, సీ&డీఎంఏకు చెల్లించాల్సిన కొన్ని ఫీజులు, ఛార్జీలకు మినహాయింపులు కల్పించడం ద్వారా ప్రాజెక్టు అమలుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు.

### రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే పైలట్ ప్రాజెక్టు

వెలంపేట రీ–డెవలప్‌మెంట్‌ను విశాఖ ఎకనామిక్ రీజియన్ (వి ఈ ఆర్ ) పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా కాలపరిమితిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కమిషనర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర పట్టణ ప్రాంతాల్లో మురికివాడల పునరాభివృద్ధికి ఇది ఆదర్శ నమూనాగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

### సమగ్ర అభివృద్ధికి జీవీఎంసీ కట్టుబడి ఉంది

రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును నాణ్యతతో, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి, పట్టణ పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు జీవీఎంసీ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆధునిక గృహాలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అంతర్గత రహదారులు, కమ్యూనిటీ సౌకర్యాలు వంటి సమగ్ర మౌలిక వసతులను కల్పిస్తూ వెలంపేటను ఆదర్శ నివాస ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన వెల్లడించారు.

## గాజువాకలో అక్రమంగా తరలిస్తున్న 900 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం..!



**విశాఖపట్నం, నేటి శుభోదయ :** విశాఖ గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 900 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శంకబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ వై. శ్రీనివాసరావు నేతృత్వంలో గాజువాక సీఐ సీహెచ్. వాసునాయుడు మరియు పోలీసు సిబ్బంది గురువారం జింక్ గేట్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ఆటోరిక్షా (నంబర్: ఏపి31 టీటీ 2044)లో నిత్యావసర వస్తువుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా తరలిస్తున్న 21 బస్తాల పీడీఎస్ బియ్యం (సుమారు 900 కిలోలు) గుర్తించారు. వెంటనే ఆటోను, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై గాజువాక పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 293/2026, సెక్షన్ 7(1) ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వ, రవాణా లేదా మళ్లింపుకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని గాజువాక సీఐ సీహెచ్, వాసు నాయుడు తెలిపారు.

## 10న డీఎస్సీ అక్రమాలు నిరసిస్తూ బైక్ ర్యాలీ..

### - దక్షిణ పార్టీ కార్యాలయంలో వార్డు నేతలతో సమన్వయ కమిటీ సమావేశం



**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :** టీచర్ పోస్టుల ఉద్యోగాలు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే డీఎస్సీ పరీక్షల్లో జరిగిన అవకతవకలు నిరసిస్తూ దక్షిణ వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆసీలమెట్ట పార్టీ కార్యాలయంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ బోలవరపు జాన్ వెస్లీ తో కలిసి శుక్రవారం వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు జగదాంబ జంక్షన్ నుండి టౌన్ కొత్త రోడ్డు వరకు బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. ఆయా వార్డుల నుండి బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 14 వార్డుల అధ్యక్షులు అందరూ సమన్వయం చేయాలని, నిరుద్యోగ యువతకు చంద్రబాబు చేసిన అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చైతన్య పరచాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ అనర్హుడని, తక్షణమే ఆ శాఖకు చిత్త శుద్ధితో తప్పుకోవాలని వాసుపల్లి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎన్నికల్లో వైయస్సార్సీపీ జెండా ఎగరనున్నదని వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు మళ్లీ జగనన్న పాలనను కోరుకుంటున్నారని, కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు యువత మేల్కొని చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ దగాపై జరగనున్న ఈ ర్యాలీకి ప్రతి ఒక్కరు హాజరుకావాలని వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. వార్డు అధ్యక్షులు పీతల వాసు, దస్మతుల మాణిక్యాల రావు, దొడ్డి బాపూఆనంద్, రాజారెడ్డి, మొహమ్మద్ షకీల్,ముజేబ్ ఖాన్, భీశెట్టి ప్రసాద్, స్టేట్ నాయకులు కనకల ఈశ్వర్,లండ రమణ, దస్మాంతుల చిన్ని ,జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయి డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగల రామరాజు, వార్డ్ ప్రెసిడెంట్ జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర,జిల్లా ఆర్ టీ ఐ ప్రెసిడెంట్ వడ్డది దిలీప్,షరీఫ్,జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, తమినేని శ్రీను,సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్ సువర్తరాజు, ఆకుల శ్యామ్, దైవకుమార్, మాదాబత్తుల రమేష్, వార్డ్ నాయకులు దస్మతుల సంతోషి, బుడ్డి, మౌళి, సలాబ్, తదితరులు పాల్గున్నారు.

## దిశా చట్టం రద్దు మహిళల భద్రతపై ప్రభుత్వం చేసిన దాడి..

**విశాఖపట్నం, ఆగస్టు 07, నేటి శుభోదయ :** విశాఖ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి , జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ కె.కె రాజు ఆదేశాల మేరకు ఈ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో విశాఖపట్నం జీవీఎంసీ జంక్షన్ లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద చంద్రబాబు మరో వెన్నుపోటు – దిశ చట్టం రద్దు... మహిళలకు ముప్పు అను నిరసన కార్యక్రమం జరిగింది.రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ,శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో దిశా చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి తీవ్రంగా ఖండించారు. మహిళల భద్రత, రక్షణ కోసం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో రూపొందించిన దిశా చట్టాన్ని రద్దు చేయడం మహిళల భద్రతను గాలికి వదిలేయడమేనని ఆమె మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యలు వంటి ఘటనలను దృష్టిలో పెట్టుకుని బాధిత మహిళలకు వేగంగా న్యాయం అందించాలనే లక్ష్యంతో వై.ఎస్. జగన్ ప్రభుత్వం దిశా చట్టాన్ని రూపొందించి రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ చట్టం కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి, అవసరమైతే ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేసి, చట్టానికి ఆమోదం తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయకుండా చట్టాన్నే పూర్తిగా రద్దు చేయడం మహిళల ప్రయోజనాలను విస్మరించిన చర్య అని విమర్శించారు. దిశా చట్టం అమల్లోకి వస్తే మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక నేరాల కేసుల్లో వేగవంతమైన విచారణ జరిగి, తక్కువ సమయంలోనే నిందితులకు శిక్ష పడే విధంగా వ్యవస్థ రూపొందించబడిందని తెలిపారు. బాధిత మహిళలకు త్వరితగతిన న్యాయం అందించాలనే సంకల్పంతోనే ఈ చట్టాన్ని రూపొందించారని, అలాంటి చట్టాన్ని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం నేరస్థులకు పరోక్షంగా ప్రోత్సాహం ఇచ్చినట్లేనని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం చట్టంతో పాటు అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని ఆమె తెలిపారు. దిశా యాప్ను రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది మహిళలకు అందుబాటులోకి తీసుకువచ్చారని, అత్యవసర పరిస్థితుల్లో ఒక కాల్ లేదా అలర్ట్తో పోలీసుల సహాయం అందే విధంగా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 1.50 కోట్లకు పైగా మహిళలు దిశా యాప్ను డౌన్లోడ్ చేసుకున్నారని, వేలాది మంది మహిళలు ఆ యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి, డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడం, మహిళల భద్రత కోసం ప్రత్యేక పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయడం, గ్రామ సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులను నియమించడం వంటి ఎన్నో విప్లవాత్మక చర్యలను జగన్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రతి మహిళకు భద్రత కల్పించడమే ఆ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి, దిశా యాప్ పేరును మార్చడం, దిశా పోలీస్ స్టేషన్ల పేరును మార్చడం ద్వారా గుర్తింపును చెరిపివేయాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నించిందని ఆమె ఆరోపించారు. పేర్లు మార్చడం ద్వారా చరిత్ర మారదని, మహిళలకు ఉపయోగపడే వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దిశా అంటే మహిళలకు ఒక భరోసా, ఒక ధైర్యం, ఒక నమ్మకం అని ఆమె పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి అఘాయిత్యం జరిగినా వెంటనే స్పందించి వారికి రక్షణ కల్పించేందుకు రూపొందించిన సమగ్ర వ్యవస్థే దిశా అని వివరించారు. అలాంటి చట్టాన్ని రద్దు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతపై తన నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసుకుందని అన్నారు. రాష్ట్రానికి ఒక మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఇటువంటి నిర్ణయానికి ఆమె మద్దతు ఇవ్వడం అత్యంత దురదృష్టకరమని వరుదు కళ్యాణి విమర్శించారు. మహిళల భద్రతకు భంగం కలిగించే నిర్ణయాన్ని అంగీకరించిన హోంమంత్రి అనిత తన పదవికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి బీఎన్ఎస్ (బి ఎన్ ఎస్ ) చట్టాలను ప్రస్తావించడం సరైన వాదన కాదని ఆమె పేర్కొన్నారు. బీఎన్ఎస్ దేశవ్యాప్తంగా అమలయ్యే సాధారణ నేర చట్టమైతే, దిశా చట్టం మాత్రం ఆంధ్రప్రదేశ్ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టమని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల్లో వేగంగా విచారణ పూర్తి చేసి, నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ప్రత్యేక న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయడమే దిశా చట్టం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలో మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రాంతాలు, ప్రజా ప్రదేశాల్లో మహిళలకు పూర్తి భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. ఇలాంటి సమయంలో మహిళలకు మరింత రక్షణ కల్పించే చట్టాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, దానిని రద్దు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దిశా చట్టం రద్దు నిర్ణయానికి నిరసనగా క్యాబినెట్ నిర్ణయాల ప్రతులను దగ్ధం చేశామని తెలిపారు. మహిళల భద్రతను కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చివరగా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, దిశా చట్టం రద్దు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, కేంద్రంతో చర్చించి దిశా చట్టానికి ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావు లేదని, మహిళల హక్కులు మరియు భద్రత కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు.పేడాడ రమణికుమారి మాట్లాడుతూ..మహిళల గౌరవం గురించి మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలను గౌరవించడం అంటే కేవలం రాజకీయ వేదికలపై మాటలు చెప్పడం మాత్రమే కాదని, ఆ గౌరవాన్ని ఆచరణలో కూడా చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి



వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, హత్యలు, లైంగిక దాడుల ఘటనలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు, బద్వేలు వంటి ప్రాంతాల్లో జరిగిన మహిళలపై దారుణ ఘటనలు రాష్ట్రంలో మహిళల భద్రత ఏ స్థాయికి దిగజారిందో తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కవచంలా నిలిచిన 'దిశ' చట్టాన్ని రద్దు చేయడం అత్యంత దురదృష్టకరమని, ఇది రాష్ట్ర మహిళా లోకానికి చేసిన తీవ్రమైన అన్యాయమని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్రంలో మహిళలు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై వరుసగా దారుణాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మహిళల భద్రతను పరిరక్షించాల్సిన పాలకులు తమ బాధ్యతను విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు అండగా ఉంటామని, ఆడబిడ్డలకు రక్షణ కల్పిస్తామని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల రక్షణకు కీలకమైన 'దిశ' వ్యవస్థను రద్దు చేయడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కోట్లాది మంది మహిళలకు అత్యవసర సమయంలో అండగా నిలిచిన దిశ యాప్ మరియు దిశ చట్టం మహిళల్లో భద్రతాభావాన్ని పెంచాయని, అలాంటి వ్యవస్థను రద్దు చేయడం మహిళల రక్షణను బలహీనపరచడమేనని పేర్కొన్నారు. మహిళల ప్రాణాలతో చెలగాటమాడే ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకుని, రద్దు చేసిన దిశ చట్టాన్ని పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా లోకాన్ని ఏకం చేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేడాడ రమణికుమారి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, మహిళ నాయకులు శ్రీదేవి వర్మ, బయ్యవరపు రాధా, బి పద్మావతి, షబీర బేగం, సత్యాల సాగరిక ,ఎం విశాలక్షి, రోజా రాణి, రీసు అనురాధ, రజిని, మజ్జి జ్యోతి , పార్వతి, జోషిల , దమయంతి, భాను, శిరాష , కృష్ణ వేణి , సత్య , మహిళ సీనియర్ నాయకులు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .